తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

బుధవారం
7 అక్టోబర్ 2026

పేజీలు - 12



# అయ్యాబాబోయ్! ఇవేం కుక్కలు!





## వింత రోగాలతో తల్లడిల్లుతున్న వీధి శునకాలు

- ఒళ్లు జలదరించేలా శరీర ఆకృతులు.. • భయాందోళనలో జిల్లా ప్రజలు..
- కళ్లముందే దుస్థితి కనిపిస్తున్నా అధికారులకు పట్టదా?
- వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నా పట్టించుకోని పశుసంవర్ధక శాఖ..
- చర్యలు ఎప్పుడంటున్న జనం..

15



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వీధి శునకాల పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది.. సాధారణంగా కనిపించే వీధి కుక్కలు ఇప్పుడు వింత వ్యాధులతో తల్లడిల్లుతూ, ఒళ్లు జలదరించేలా మారిన శరీర ఆకృతులతో రోడ్లపై సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.. చర్మవ్యాధులు, ఒంటిపై రోమాలు ఊడిపోవడం, గాయాలు, శరీరంపై పొక్కులు, బలహీనత వంటి లక్షణాలతో కనిపిస్తున్న కుక్కలు ప్రధాన రహదారులు, కాలనీలు, నివాస ప్రాంతాల్లో తిరుగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..



# మూలన పడ్డ పల్లె దవాఖానలు

- నిరుపయోగంగా మారిన భవనాలు

**కౌటాల అక్టోబర్ 06 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె దవాఖానల నిర్మాణాలు చేపట్టి నప్పటికీ రెండేళ్లుగా ప్రారంభానికి నోచుకోకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కౌటాల మండలంలో లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనాలు ప్రజలకు ఉపయోగ పడకుండా ఖాళీగా పడి ఉండటంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ, దాని పరిధిలో అనేక గ్రామాలు ఉండటం, గ్రామ జనాభా అధికంగా ఉండటంతో స్థానికులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా పల్లె దవాఖాన నిర్మించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. కౌటాల, మొగడ్ ధగడ్, ముత్తంపేట్ గ్రామాల్లో పల్లె దవాఖానలు మంజూరు కాగా నిర్మాణం పూర్తి అయినప్పటికీ నేటికీ ప్రారంభం చేసేందుకు జాప్యం జరుగుతోంది.



పల్లె దవాఖాన భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ విద్యుత్తు సౌకర్యం, ఫ్యాన్లు, బాత్రూంలు లాంటి సదుపాయాలు కొన్ని మిగిలి ఉన్నాయి. దీంతో భవనం ఖాళీగా ఉండిపోయింది. వైద్య సేవల కోసం ప్రస్తుతం గ్రామ ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపైనే ఆధారపడాల్సి వస్తోంది. చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఇబ్బందులు ఎదురొంటున్నామని, గ్రామంలోనే దవాఖాన ప్రారంభమైతే ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పల్లెదవాఖాన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం మారిన తర్వాత పనులు నెమ్మదించాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన పనికావడంతోనే నిర్లక్ష్యం జరుగుతోందా? లేక త్వరలో ప్రారంభిస్తారా? అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవు తున్నాయి. రాజకీయా లకు అతీతంగా ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని భవనాలను వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

### పల్లె ప్రజలకు వైద్యం అందించాలి



మా గ్రామంలో అధిక జనాభా ఉన్నందున పల్లె దవఖాన పనులు వెంటనే పూర్తి చేసి వెంటనే ప్రారంభించాలి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూడాలి. చుట్టుపక్క గ్రామాల ప్రజలకు మంచి వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన పల్లె దవాఖానను ప్రారంభించి, ఇక్కడి ప్రజలకు భరోసా ఇవ్వాలని ప్రభుత్వ అధికారులను కోరుతున్నా.

**గోగర్ల శ్రీనివాస్ సోషల్ మీడియా ఆక్టివిస్ట్**
**,గ్రామం.ముత్తంపేట్**



# భూపాలపల్లి ఏరియాలో డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు పర్యటన

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు మంగళవారం భూపాలపల్లి ఏరియాలో పర్యటించారు. ఏరియాకు విచ్చేసిన ఆయనకు జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కెటికే ఓసీ-2, కెటికే ఓసీ-3 ఉపరితల గనులను సందర్శించి బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు, గని అభివృద్ధి పనులు, యంత్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను ప్రణాళికా బద్ధంగా సాధించాలని, వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, భద్రతా నిబంధనలు పాటిస్తూ లక్ష్యాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రామన్ పాఠక్, ఓసీ-2 పీఓ శ్యాంసుందర్, ఓసీ-3 పీఓ రామస్వామి తదితర అధికారులు, గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

# రెవెన్యూ, ఇరిగేషన్ భూముల లెక్కలు తేల్చాలి

- పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



**ఖానాపూర్ అక్టోబర్ 06 (జనం సాక్షి)** నిరుపేద ప్రతి ఒక్కరికీ పక్కా నివాసం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలసి ఆయన వివిధ శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు, ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ భూసేకరణపై అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు కోసం ప్రభుత్వం ఇప్పటివరకు సేకరించిన భూమి ఎంత? వివిధ శాఖలకు, సంఘాలకు కేటాయించింది ఎంత? నిరుపేద లబ్ధిదారుల కోసం మిగిలి ఉన్న స్థలం ఎంత? అనే అంశాలపై పూర్తిస్థాయి లెక్కలు తేల్చి, నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ, పాఠశాలలు, లైబ్రరీలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి స్థలాలు చూపించడంలో అధికారుల అలసత్వమే ప్రధాన ప్రతిబంధకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో భూములు ఉన్నా జనాభా లేక, ఖానాపూర్ లో జనాభా ఉన్నా భూమి చూపించలేక మొదటి విడతలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే, రెండో విడతలో పట్టుబట్టి భూసేకరణ పూర్తి చేసి ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా పని చేయాలని సూచించారు. అధికార పార్టీకి చెందినవారు కానీ, ఇతర పార్టీల వారు కానీ ఒత్తిడి తెస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, తప్పులు దొర్లకుండా అభివృద్ధిపైనే దృష్టి సారించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కడెం రిసార్ట్ ఆక్రమణలపై శాఖాపరమైన విచారణ వేగవంతం చేసి నివేదిక ఇవ్వాలని, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కడెం, పెద్దూరు గ్రామాల్లో ఇరిగేషన్ భూముల్లో ఏళ్లుగా నివసిస్తున్న వారికి పక్కా పట్టాలు వర్తింపజేయాలని, ఆక్రమణకు గురైన మిగతా ఇరిగేషన్ స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. కడెం మండలం బెల్లాల్ శివారులోని కుర్రు ప్రాంత భూముల ఆక్రమణలపై విచారణ జరిపి, గతంలో నిరుపేదలకు ఇచ్చిన పట్టా భూములను తిరిగి వారికి దక్కేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ... ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహించే ఇటువంటి సమీక్షల వల్లే నియోజకవర్గంలో ఆశించిన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎమ్మెల్యే లేవనెత్తిన కడెం రిసార్ట్, అక్రమ మొరం దందాలు, కుర్రు ప్రాంత భూములు, డబుల్ బెడ్‌రూమ్ నివేదికలపై 30 రోజుల్లోగా 60 శాతానికి పైగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తదుపరి సమావేశం నాటికి పూర్తిస్థాయి నివేదికతో సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ రమేష్ రాథోడ్, ఆర్డీవో దేవిదాస్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




**పరకాల, అక్టోబర్ 6, (జనంసాక్షి):** పరకాల ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడబ్ల్యూయూ--ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థుల తరఫున పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. రీజియన్ క్లాస్ సీరియల్ నెంబర్ 6, స్టేట్ క్లాస్ సీరియల్ నెంబర్ 3 బాణం గుర్తుపై ఓటు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ కార్మికులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఐక్య కూటమి అభ్యర్థులకు ప్రతి ఒక్క కార్మికుడు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా పనిచేస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ఆర్టీసీ కార్మికుల ఎన్నికలను అడ్డుకుని, వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తూ, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ఆర్టీసీ కార్మికులు ఐక్యంగా నిలిచి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా, టీడబ్ల్యూయూ--ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాబోయే రోజుల్లో పరకాల ఆర్టీసీ డిపోను మరింత అభివృద్ధి చేసి, కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు.

# ధర్మగడ్డలో హస్తం వైపు అడుగులు

- బీఆర్ఎస్‌కు గుడ్‌బై కాంగ్రెస్‌కు జై
- మూడ చందన దేవేందర్ ఆధ్వర్యంలో చేరికలు
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమక్షంలో కండువాల స్వీకారం



**దేవరుప్పుల, అక్టోబర్ 06 (జనం సాక్షి):** ధర్మగడ్డ తండాలో బీఆర్ఎస్‌కు చెందిన వార్డు సభ్యురాలు భూక్య బికినీతో పాటు భూక్య శ్రీనివాస్, భూక్య సోమ్లా, బానోత్ శ్రీనివాస్, మూడ మహేష్, మూడ మనోజ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. మూడ చందన దేవేందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తండా అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై దేవేందర్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్, నల్ల యాదగిరి, పంగ ఐలయ్య, కున్సోత్ లక్ష్మణ్, మూడ జగురామ్, పంగ వెంకన్న, కాసర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో ఎస్పీ జానకి షర్మిలకు సన్మానం



**నిర్మల్ టౌన్, అక్టోబర్ 06,(జనంసాక్షి )** నిర్మల్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. నిర్మల్‌తో పాటు ఖానాపూర్, భైంసా ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన కార్యక్రమాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు తీసుకున్న చర్యలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నూతన పట్టణ అధ్యక్షుడు ఆకుల హరీష్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలను ఘనంగా సన్మానించారు. గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసుల కృషిని అభినందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పండుగ కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది చేసిన సేవలను కాంగ్రెస్ నాయకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్

## మంత్రికి మున్సిపల్ వైస్‌చైర్మన్ అప్పాల గణేష్ వినతి



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 06,(జనంసాక్షి ):** జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని నిర్మల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్మల్ పట్టణ మాస్టర్ ప్లాన్‌పై జూపల్లి కృష్ణారావుతో చర్చించారు. ప్రజల అవసరాలు, పట్టణ భవిష్యత్ అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని కోరారు. దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పట్టణ సమగ్రాభివృద్ధికి అనుకూలంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పేదలకు ప్రాధాన్యం కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ప్రజా సంక్షేమం, పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై మంత్రులతో చర్చించారు. ఆయనతో పాటు. జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ సయ్యద్ అంజుమన్ అలీ, పట్టణ అధ్యక్షులు ఆకుల హరీష్ ఉన్నారు.

# నీటి సౌకర్యం లేక భక్తులకు ఇబ్బంది



**సారంగాపూర్, అక్టోబర్ 6 (జనం సాక్షి)** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని శ్రీ మహా డెల్లి పోచమ్మ ఆలయంలో నీటి సౌకర్యం కొరత ఏర్పడడంతో భక్తులకు ఇబ్బందిగా తయారైంది. అమ్మవారిని దర్శించుకోవాలంటే పాదాలు శుభ్రం చేసుకుని వెళ్ళవలసి ఉంటుంది కానీ మూడు రోజుల నుండి నీటి సౌకర్యం లేకపోవడంతో భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. లక్షల ఆదాయం వస్తున్న ఆలయానికి కనీస వసతులు ఏర్పాటుకు చేయకపోవడం భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కలిగించాలి

### సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

### మాజీ మంత్రి కొండా సురేఖ

**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 6 (జనం సాక్షి)**రంగలీల మైదానం, ఉర్సు గుట్ట, కరీమాబాద్, ఉర్సు ప్రాంతంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ ఉత్సవాలు, రావణ వధ ఉత్సవాల ఏర్పాట్లపై మాజీ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఉరుసు గుట్ట వద్ద మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.దసరా, సద్దుల బతుకమ్మ పండగలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కొండా సురేఖ సూచించారు.సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనే నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మ నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో కూడా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.అలాగే రావణ వధ కార్యక్రమానికి భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ తీగలు, తాత్కాలిక కనెక్షన్లు, లైటింగ్ వ్యవస్థలను ముందుగానే పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు.ఉత్సవ ప్రాంగణంలో నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వైద్య సదుపాయాలు, అంబులెన్స్లు, అగ్నిమాపక వాహనాలు



అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు.ప్రజల భద్రతే మొదటి ప్రాధాన్యతగా అధికారులు పనిచేయాలని, ఏ చిన్న లోపం కూడా పండగ సమయంలో ప్రజలకు ఇబ్బందిగా మారకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించాలని కొండా సురేఖ స్పష్టం చేశారు. కార్యక్రమాల నిర్వహణ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అంతకు ముందు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వివిధ శాఖల వారీగా ఉత్సవాల ఏర్పాట్లు సంబంధించిన విషయాలపై సంబంధిత అధికారులను అడిగారు. అదేవిధంగా వరంగల్ సిపి శ్వేత ఉత్సవాలకు హాజరైనటువంటి ప్రజల భద్రతపై ట్రాఫిక్ నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ సత్య శారద , పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ , ఉత్సవ కమిటీ బాధ్యులు నాగపురి సంజయ్, మేడిది మధుసూదన్, మండ వెంకన్న, గోనె రాంప్రసాద్, వడ్నాల నరేందర్, శివ మూర్తి, కోటి, అజయ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సింగపూర్ విద్యా పర్యటన స్ఫూర్తితో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**శాయంపేట ,అక్టోబర్ 6 (జనం సాక్షి)** మండలంలోని ఎంపీపీ ఎస్ శాయంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో చక్కని చేతిరాత నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో అదే పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న బొలిశెట్టి ప్రవీణ విద్యార్థులకు సూచిరాత పుస్తకాలతో పాటు ఇతర విద్యా సామగ్రిని బహూకరించారు.ఇటీవల సింగపూర్లో నిర్వహించిన విద్యా పర్యటనలో పాల్గొని స్వదేశానికి తిరిగి వచ్చిన బొలిశెట్టి ప్రవీణ అక్కడి విద్యా విధానాలు, విద్యార్థుల ప్రతిభాపాటవాలు, చక్కని చేతిరాత నైపుణ్యాలను పరిశీలించారు. అక్కడ గమనించిన మంచి విద్యా పద్ధతుల స్ఫూర్తితో మన పాఠశాల విద్యార్థుల్లోనూ సూచిరాత నైపుణ్యాలను మెరుగుపరచాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి జి. బిక్షపతి చేతుల మీదుగా విద్యార్థులకు సూచిరాత పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని అందజేశారు. విద్యార్థులు ప్రతిరోజూ సాధన చేయడం ద్వారా చక్కని చేతిరాతను అలవర్చుకోవాలని, చదువుతో



పాటు ఇతర నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న ఇటువంటి కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్ల అశోక్ రెడ్డి, మేడిపల్లి సురేందర్, కే. ఉమా, పి. స్వప్న రాణి, ప్రత్యూష, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు మొగిలికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

### ప్రదానం చేసిన రాష్ట్రభాషోపాధ్యాయ సంస్థ

**చెన్నారావుపేట, అక్టోబర్ 6 ( జనం సాక్షి):** చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగుభాషోపాధ్యాయుడు లెంకలపల్లి మొగిలికి రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్ఎల్టిఏ) ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంను అందించారు. హైదరాబాద్ లోని సారస్వత పరిషత్ లో జరిగిన కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్, తెలుగు పాఠ్య పుస్తక రచయిత రఘు, ఎస్ఎల్ టిఏ రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్ రావు పాల్గొని లెంకలపల్లి మొగిలిని అభినందించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందజేశారు.ఉపాధ్యాయుడిగా విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి, తెలుగు భాషా పరిరక్షణకు, సాహిత్యంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు ఆయన చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ మాట్లాడుతూ లెంకలపల్లి మొగిలి విద్యార్థులకు తెలుగు భాషను సులభంగా, ఆసక్తికరంగా బోధిస్తూ వారిలో భాషాభిమానం, సాహిత్యంపై ఆసక్తిని



పెంపొందిస్తున్నారని అన్నారు. పాఠశాలలో నిర్వహించే భాషా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొంటూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. తెలంగాణ భాషా దినోత్సవం, వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం, పద్యపఠనం, నాటికలు తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో మొగిలి కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ తెలుగు భాష పట్ల మమకారాన్ని పెంపొందించడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు.ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ లెంకలపల్లి మొగిలికి అభినందనలు తెలిపారు. ఈ పురస్కారం ఆయన విద్యా సేవలకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని వారు పేర్కొన్నారు.

## రష్యాలో చిక్కుకున్న నిర్మల్ యువకుడి కోసం ఎమ్మెల్యే చొరవ

**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 06,(జనంసాక్షి )):** రష్యాలో చిక్కుకుపోయిన నిర్మల్ జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన చౌటుపల్లి నరేష్‌ను సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. ఉపాధి కోసం 2025 నవంబర్ 13న రష్యా వెళ్లిన నరేష్.. 2026 ఏప్రిల్ 15 నుంచి కుటుంబ సభ్యులకు అందుబాటులో లేకుండా పోయారు. రష్యన్ ఆర్మీలో చేరాల్సి వస్తోందని గతంలో కుటుంబ సభ్యులకు తెలిపినట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది.నరేష్ కుటుంబ సభ్యుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని ఆయన



ఆచూకీ గుర్తించి సురక్షితంగా భారత్‌కు తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, మాస్కోలోని భారత రాయబార కార్యాలయం, రష్యా అధికారులను కోరారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం సాధారణ పరిపాలన (ఎన్ఆర్ఐ) శాఖ ద్వారా మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి, మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి అధికారికంగా వైర్‌లెస్ సందేశం పంపింది.నరేష్‌ను గుర్తించి స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు వేగవంతం చేయాలని అందులో కోరారు. నరేష్‌ను సురక్షితంగా భారత్‌కు తీసుకురావడానికి అన్ని విధాలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## జర్నలిస్టుల పోస్ట్‌కార్డు ఉద్యమం



**కాళేశ్వరం , అక్టోబర్ 6, ( జనం సాక్షి)**జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు, ఈ హెచ్ ఎస్ పథకం పునరుద్ధరణ కోరుతూ టి యు డబ్ల్యు జె రాష్ట్ర కమిటీ పోస్ట్‌కార్డు ఉద్యమానికి పిలుపునిచ్చింది. అక్టోబర్ 8 వరకు జర్నలిస్టులందరూ ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డులు పంపాలని కోరింది. ఈ నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం జర్నలిస్టులు పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా సీఎం కార్యాలయానికి తమ సమస్యలు పరిష్కరించాలని పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు హైదర్ , వెంకటేష్ , దీన్, శ్రావణ్ , సంతోష్ , సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ వెరిఫికేషన్

### ఖానాపూర్ సీడిపిఓ నాగలక్ష్మి



**ఖానాపూర్ రూరల్ 6 అక్టోబర్ (జనం సాక్షి,):** ఖానాపూర్ ఐ సి డి ఎస్ ప్రాజెక్టు పరిధిలో 20 అంగన్వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి ఈ పోస్టులకు ఐదు మండలాల అర్హత గల 455 మంది మహిళలు దరఖాస్తులు చేసుకున్నారు. మంగళవారం ఖానాపూర్ సిడిపిఓ నాగలక్ష్మి పర్యవేక్షణలో దరఖాస్తు చేసుకున్న మహిళల సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టారు. ఈ వెరిఫికేషన్ లో మామడ, పెంబి, దస్తూరాబాద్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగింది అని సి డి పి ఓ నాగలక్ష్మి అన్నారు. మరియు బుధవారం ఖానాపూర్, కడం, అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనున్నదని. దీనికి అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఖానాపూర్ ఐ సి డి ఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి ఉదయం సమయానికి హాజరు కావాలని తెలిపారు.

## ప్లాస్టిక్ భూతం నుంచి ప్రపంచాన్ని కాపాడాలి

### వన్యప్రాణి వారోత్సవాల్లో ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమం



**నెన్నెల, అక్టోబర్ 6 (జనంసాక్షి)** జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కుశ్నేపల్లి రేంజ్ ఆఫీస్ పరిధిలో అటవీశాఖ సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అటవీ క్షేత్రాధికారి పి. దయాకర్ తెలిపారు. పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రజలకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అటవీ క్షేత్రాధికారి పి. దయాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతం నుంచి ప్రపంచాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా వన్యప్రాణులు, అటవీ ప్రాంతాలను రక్షించవచ్చని తెలిపారు.ప్రజలు అవసరమైన చోట మాత్రమే ప్లాస్టిక్‌ను వినియోగించి, వీలైనంత వరకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వికలాంగులకు అండగా ప్రజా ప్రభుత్వం

### మైలారం ఉపసర్పంచ్ మస్కే కుమారస్వామి

**శాయంపేట ,అక్టోబర్ 6(జనం సాక్షి)**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం వికలాంగులకు అండగా నిలుస్తుందని మైలారం ఉప సర్పంచ్ మస్కే కుమారస్వామి అన్నారు. మైలారం గ్రామంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మంజూరు చేయించిన బ్యాటరీ ట్రై సైకిల్ ను వికలాంగుడు బొంతల రవి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు పెండెల సదయ్య, పల్లెబోయిన రాజు ,కాంగ్రెస్ నాయకులు మామిడిపల్లి సాంబయ్య ,అరికెళ్ల సుధాకర్, వెంకటేశ్వర్లు, శ్రీరాముల అనిల్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు .



# కపాస్ క్రాంతి మిషన్‌తో రైతులకు అధిక దిగుబడి : ఎమ్మెల్యే హరీష్ బాబు

- పత్తి చేలు పరిశీలన.. ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వెల్లడి
- ఆగర్గూడలో రైతులకు ఉచిత మందుల పంపిణీ



**పెంచికల్ పేట్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :-** కపాస్ క్రాంతి మిషన్ ద్వారా లబ్ధి పొందిన రైతులను కలిసి వారి పత్తి చేలను సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు పరిశీలించారు. పెంచికల్ పేట్ మండలంలోని ఆగర్గూడ గ్రామానికి చెందిన పలువురు రైతులు కేంద్ర ప్రభుత్వ పథకమైన కపాస్ క్రాంతి మిషన్ ద్వారా పత్తి విత్తనాలు వేశారు. మంగళవారం ఆ పత్తి చేలల్లో ఎమ్మెల్యే వ్యవసాయ అధికారులతో కలిసి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రతతో నాటిన పత్తి మొక్కలతో అధిక దిగుబడి సాధ్యమవుతుందని, ఎకరానికి 15 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పత్తి సాగులో అధిక దిగుబడి సాధించడానికి కేంద్ర ప్రభుత్వం కపాస్ క్రాంతి మిషన్ ను ప్రవేశపెట్టిందని, దాని ద్వారా రైతులకు ఉచితంగా నాణ్యమైన పత్తి విత్తనాలతో పాటు పిచికారీ మందులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆగర్గూడ గ్రామ పంచాయతీ భవనంలో రైతులకు ఉచితంగా బయో స్టిములెంట్ మందులు మరియు దోమ నివారణ మందులను పంపిణీ చేశారు. రైతులకు గత మూడు సంవత్సరాలుగా తాను ఎమ్మెల్యే అయిన తర్వాత మెరుగైన సేవలు అందిస్తున్నామని, యూరియా మరియు డీఏపీ సరఫరాను క్రమబద్ధీకరించామని తెలిపారు. పూర్తిస్థాయిలో వరి, పత్తి మరియు మొక్కజొన్న రైతులకు మద్దతు ధర లభిస్తుందని, గతంలో మాదిరిగా అడ్డగోలు కటింగులు లేకుండా చేశామని చెప్పారు. గ్రామాలు, పట్టణం ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి వైపు నడుస్తున్నాయని, ఎక్కడా అక్రమ కేసులు, భూకబ్జాలు లేకుండా ప్రశాంతమైన వాతావరణం సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగర్గూడ సర్పంచ్ అల్లూరి రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి డా. వెంకటి, ఏవో రామకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త డా. మధు, సర్పంచులు భక్తు రాంచందర్, చప్పిడే రవీందర్, కృష్ణవేణి-హరీష్, ఉమా మహేష్, నాయకులు బోదాసు మాధవి, కుకుడే రాజేశ్వర్, నార వనజ, బండి ప్రభాకర్, డోకె నారాయణ, పాలే సంతోష్, కాంతారావు పాల్గొన్నారు.

# అచలాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఘన సన్మానం

## బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నౌనూరి సుధీర్ గౌడ్ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్'

## చిన్నారులను కన్నతల్లిలా చూసుకునే అంగన్‌వాడీ దీదీల సేవలు వెలకట్టలేనివి



**తాండూర్, అక్టోబర్ 06(జనం సాక్షి)** ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సుపరిపాలన, దేశం పట్ల ఆయనకున్న అంకితభావానికి గుర్తింపుగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు, మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ సూచనల ప్రకారం తాండూరు మండలం అచలాపూర్ గ్రామంలో 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నౌనూరి సుధీర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను శాలువాలతో ఘనంగా సన్మానించారు,ఈ సందర్భంగా నౌనూరి సుధీర్ గౌడ్ మాట్లాడుతూ... ప్రధాని మోదీ గారి ప్రజాసేవకు ప్రతీకగా దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 17 వరకు 'అంగన్వాడీ ఉత్సవాలు' అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో పసిపిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడంలో అంగన్‌వాడీ కేంద్రాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. మన దేశ భవిష్యత్తు ఆ దేశ బాలల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుందని, అలాంటి చిన్నారులకు సరైన పోషకాహారంతో పాటు ప్రాథమిక విద్యను అందించి వారిని భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు ఎలా చూసుకుంటారో, కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారినీ అంతకంటే ఎక్కువగా ఎంతో ప్రేమ, ఆప్యాయతలతో కన్నతల్లిలా చూసుకునే 'అంగన్‌వాడీ దీదీల' సేవలు నిజంగా వెలకట్టలేనివని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బిజెపి మండల ఉపాధ్యక్షులు కొండు రవి, రేవెల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఈర్ల సంతోష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అడ్వాల సతీష్, వార్డు సభ్యులు వరిమడ్ల విజయ్, గంగాధరి శ్రీనివాస్, ఏముర్ల రవి కుమార్, బొగరపు సతీష్, కౌటం రమేష్, ఎల్లెల శ్రీనివాస్, సంగర్తి భాణేష్, ఉపేందర్, జూపాక నరేష్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైలారం గ్రామంలో సేవా సంకల్ప అభియాన్

**అంగన్వాడీ టీచర్లను సన్మానించిన చందుపట్ల కీర్తి రెడ్డి**



**శాయంపేట ,అక్టోబర్ 6 (జనం సాక్షి)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శాయంపేట మండలంలోని మైలారం గ్రామంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ శాయంపేట మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడునూతుల నిశిధర్ రెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి ఆరుట్ల దశమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో బీజేపీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అంగన్వాడీ టీచర్లు చిన్నారుల సంరక్షణ, పోషణ, విద్యాభివృద్ధి కోసం అందిస్తున్న సేవలను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా చందుపట్ల కీర్తి రెడ్డి స్వయంగా అంగన్వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో ప్రజాసేవకు మరింత ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్తులో కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాయరాకుల మొగిలి, జిల్లా ఉపాధ్యక్షులు కోడెపాక స్వరూప,జిల్లా కౌన్సిల్ సభ్యులు కానుగుల నాగరాజ్, మండల ఉపాధ్యక్షులు కోమటి రాజశేఖర్, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, మైలారం గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా!

## భవనం సిద్ధమైనా.. వైద్య సేవలు ఎప్పుడో?



**దస్తూరాబాద్, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన పల్లె దవాఖానా భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ, ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన వైద్య కేంద్రం తలుపులు తెరుచుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు సైతం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా స్థానికంగానే వైద్య సేవలు అందించేందుకు పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే భవనం సిద్ధంగా ఉన్నా వైద్య సేవలు ప్రారంభం కాకపోవడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. భవన నిర్మాణం పూర్తయింది.. మరి వైద్య సేవలు ఎప్పుడు ప్రారంభిస్తారు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పల్లె దవాఖానాను ప్రారంభించి, వైద్య సిబ్బందిని నియమించి ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

# తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరిన వ్యాపారవేత్త రాజేశ్వర్



**నేరడిగొండ అక్టోబర్6(జనంసాక్షి):** మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రాజేశ్వర్ తెలంగాణ రక్షణ సేన పార్టీలో బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్, జిల్లా అధ్యక్షులు రాథోడ్ బాపూరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ రాథోడ్ బాపూరావు మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడని, అందరితో స్నేహభావంతో కలిసిమెలిసి ఉంటారని తెలుసుకుని, ఆయన ఎక్కడ ఉంటే అక్కడ తాను సిద్ధంగా ఉండి ప్రజాసేవలో భాగస్వామి అవుతానని తెలిపారు. మండల కన్వీనర్ బానోత్ వసంత్ రావు మైనారిటీ చైర్మన్ అయూబ్ బేగ్ పాల్గొని రాజేశ్వర్ కి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతానికికలిసికట్టుగా ముందుకు సాగుదామని పేర్కొన్నారు.

# పూర్తిస్థాయిలో ఈ-వేస్ట్ డిస్పోజల్ చేయాలి

## ఏరియా సింగరేణి జీఎం శ్రీనివాస్



**శ్రీరాంపూర్(జనంసాక్షి):** ఈ-వేస్ట్‌ను ఎక్కడికక్కడ పేరుకుపోనివ్వకుండా పూర్తిస్థాయిలో సేకరించి, పర్యావరణానికి హాని కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో డిస్పోజల్ చేయాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి జీఎం శ్రీనివాస్ సూచించారు.స్వచ్ఛత ప్రత్యేక కార్యక్రమం 6.0లో భాగంగా మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఈ-వేస్ట్ కలెక్షన్ డ్రైవ్‌లో ఆయన అధికారులు, ఉద్యోగులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేయకుండా ఉన్న కంప్యూటర్లు, కీబోర్డులు, మౌస్‌లు ,కేబుల్స్,ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ బాక్సుల్లో సేకరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.కేంద్ర ప్రభుత్వం,బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్వచ్ఛత పక్వాడా లో భాగంగా ఈ సారి ఈ వేస్ట్ డిస్పోజబుల్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. అన్ని కార్యాలయాలు,విభాగాలు,గనుల్లో వృథాగా ఉన్న పనిచేయని ఎలక్ట్రానిక్ పరికరాలను గుర్తించి ఈ-వేస్ట్‌గా సేకరించాలని జీఎం సూచించారు. సేకరించిన ఈ-వేస్ట్‌ను సంబంధిత యూనిట్లకు తరలించి పూర్తిస్థాయిలో డిస్పోజల్ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.శ్రీరాంపూర్ ఏరియా స్వచ్ఛత కార్యక్రమాల్లో 2023లో ప్రథమ,2024, 2025లో ద్వితీయ బహుమతులు సాధించిందని గుర్తుచేశారు. ఈసారి ప్రథమ బహుమతి సాధించేలా అధికారులు,ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ ప్రతినిధి పద్మ,ఐకే ఓసీ ప్రాజెక్ట్ అధికారి ఏవీ రెడ్డి,ఏజీఎం శ్రీధర్,డీజీఎంలు ఎస్.అనిల్ కుమార్, డీజీఎం రాజన్న, డీజీఎం హరినారాయణ, ఏరియా ఇంజనీర్ సురేష్ పాల్గొన్నారు.

## పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్ నిర్మాణ డిజైన్లను త్వరగా సిద్ధం చేయాలి

### వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి కలెక్టర్ సమీక్ష సమావేశం



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 6(జనం సాక్షి) :**హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్ లే అవుట్, నిర్మాణ డిజైన్లను త్వరగా సిద్ధం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో దామెర మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ లేఅవుట్, డిజైన్ పై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా డెయిరీ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన వివిధ అంశాల పురోగతిపై ఎమ్మెల్యే, కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఇందులో భాగంగా దామెరలో ఏర్పాటు చేస్తున్న డెయిరీ ప్లాంట్ యొక్క సివిల్ వర్క్స్, లేఅవుట్ ప్లాన్ , బీఎంసీయూల కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పాల డెయిరీ భవన నిర్మాణ డిజైన్ లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. డెయిరీ ప్లాంట్ నిర్మాణ పనులకు అవసరమైన డిజైన్లను త్వరగా సిద్ధం చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా సంగెం మండలంలో ఏర్పాటు చేయనున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల (బీఎంసీయూ )కొనుగోలు ప్రక్రియను జిల్లా స్థాయి కమిటీ ద్వారా తుది నిర్ణయం తీసుకున్న సంస్థల నుంచి వెంటనే పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ మేన శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ రాజగోపాల్ రావు, ఆరిజిన్ కన్సల్టెంట్ ప్రతినిధి వైవియన్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ వెంకటేశ్వర్లు, డిపిఎం సరిత ఏపీఎం దివాకర్ రాయి పరకాల ఇందిరా మహిళా డెయిరీ మేనేజర్లు కృష్ణ, సృజన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయాన్ని కనుమరుగయ్యేలా చేస్తారా?

### మాజీ ఎంపీ వినోద్ కుమార్




**ములుగు ప్రతినిధి,అక్టోబర్06(జనం సాక్షి):-**19 ఏళ్ల బొగ్గు కోసం 800 ఏళ్ల చరిత్ర కలిగిన రామప్పను పణంగా పెట్టడం అన్యాయమని , దీన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.ములుగు జిల్లా వెంకటాపూర్ వద్ద సింగరేణి ప్రతిపాదించిన పివిఎన్ఆర్ ఓపెన్ కాస్ట్ గనిపై ఆయన మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ములుగు అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తో కలిసి తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు,ఇది కేవలం మైనింగ్ ప్రాజెక్ట్ కాదని,ఇది మన తెలంగాణ గర్వకారణమైన రామప్ప దేవాలయమని , రామప్ప చెరువు,కాకతీయుల సాగునీటి వ్యవస్థకు సంబంధించిన అంశమని అన్నారు.కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ నివేదిక ఏం చెబుతోంది? ప్రతిపాదిత గని 300 మీటర్ల లోతు ఉంటుందని,ఇది రామప్ప దేవాలయానికి, చెరువుకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలోనే ఉందని . మీరే ఆలోచించాలని అన్నారు. 300 మీటర్ల లోతైన గని అక్కడ తవ్వితే రామప్ప ఏమవుతుందో అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు.అందరూ తెలుసుకోవాల్సిన విషయం ఏంటంటే, ఇటీవల యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ 2026 సమావేశంలో ఏం చెప్పింది? రామప్ప దేవాలయం మాత్రమే కాదు, దాని చుట్టూ ఉన్న చెరువు, కాలువలు, సాగు భూములు మొత్తం వారసత్వంలో భాగమే అని చెప్పిందని అన్నారు.ఆ బఫర్ జోన్ ను విస్తరించి, 2027 ఫిబ్రవరి 1 లోపు ప్రతిపాదన ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరిందని తెలిపారు.ఒకవైపు యునెస్కో రక్షణ పెంచమంటోందని,మరోవైపు మన ప్రభుత్వాలు అదే చోట గనిని తవ్వాలని చూస్తున్నాయని ఆరోపించారు . దేశంలో బొగ్గు గనులు చాలా ఉన్నాయని,బొగ్గును ఎక్కడైనా తీయొచ్చునని, కానీ రామప్పను మనం మరోచోట కట్టలేమని అన్నారు .ఈ గని వల్ల పేలుళ్లు జరుగుతాయని, కంపనాలు వస్తాయని అన్నారు.ఇప్పటికే రామప్ప దేవాలయంలో పగుళ్లు, కుంగిపోతున్న సమస్యలు ఉన్నాయని నివేదిక చెబుతోందని అన్నారు . ఇలాంటి పరిస్థితిలో గని తవ్వితే దేవాలయం తట్టుకుంటుందా? అని అయన ప్రశ్నించారు.రామప్ప చెరువు సంగతి చూడండి. దీనికి 3 టీఎంసీల నీళ్లు నిల్వ ఉంటాయి, 30 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తుంది. ఇది రైతుల జీవనాధారం. దీన్ని ప్రమాదంలోకి నెట్టడం సరికాదని అన్నారు.నేను అభివృద్ధికి వ్యతిరేకం కాదు, సింగరేణికి వ్యతిరేకం కాదు. కానీ వారసత్వ విధ్వంసానికి వ్యతిరేకమని పేర్కొన్నారు.

## కాజీపేట వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులకు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

### హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు సుమారు 100 మంది గుడిసె వాసుల సంతకాలతో మెమోరాండం



**కాజీపేట అక్టోబర్: 6 (జనం సాక్షి)**కాజీపేట చౌరస్తాను ఆనుకుని ఉన్న కడిపికొండ శివారు సర్వే నంబర్లు 71, 72, 73లోని ప్రభుత్వ సీలింగ్ భూమిలో గత 22 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న కాజీపేట వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులకు నివాస స్థలాలపై పట్టాలు మంజూరు చేసి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ వీకర్ సెక్షన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కలిసి మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా వీకర్ సెక్షన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పసునూరి మనోహర్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుస్ తో పాటు కాజీపేట వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులు పాల్గొన్నారు. సుమారు 100 మంది గుడిసె వాసులు తమ సంతకాలు చేసి, అందరూ కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు.సుమారు 2005 సంవత్సరం నుంచి వైఎస్ఆర్ నగర్‌లోని సర్వే



నంబర్లు 71, 72, 73లో గుడిసెలు ఏర్పాటు చేసుకుని పేద, బలహీన వర్గాల కుటుంబాలు నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇక్కడ నివాసం ఉంటున్న కుటుంబాలకు మున్సిపల్ ఇంటి నంబర్లు కూడా మంజూరయ్యాయని, వాటి ఆధారంగా ఆధార్, రేషన్ కార్డులు, ఓటర్ ఐడీ కార్డులు తదితర ప్రభుత్వ గుర్తింపు పత్రాలు ఇదే చిరునామాతో ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 22 సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్నప్పటికీ ఇప్పటివరకు తమ నివాస స్థలాలకు పట్టాలు మంజూరు కాలేదని, దీంతో పేద కుటుంబాలు భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నాయని తెలిపారు.కావున సంబంధిత అధికారులతో స్థల పరిశీలన, సమగ్ర విచారణ నిర్వహించి అర్హులైన వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులకు నివాస స్థలాలపై పట్టాలు/హక్కు పత్రాలు మంజూరు చేయాలని, అలాగే అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి శాశ్వత నివాస భద్రత కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.పేద, బలహీన వర్గాల గుడిసె వాసుల సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి, త్వరితగతిన అధికారులతో విచారణ జరిపించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులు సంతకాలతో కలిసి, వీకర్ సెక్షన్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్సైగా దయాసాగర్‌కు పదోన్నతి

### జిల్లా ఎస్పీ చేతుల మీదుగా స్టార్ అలంకరణ



**ములుగు ప్రతినిధి, అక్టోబర్6 (జనం సాక్షి):-**ములుగు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కే. దయాసాగర్ ఏఎస్సైగా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా మంగళవారం ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ దయాసాగర్ కు ఏఎస్సై ర్యాంక్ స్టార్‌ను అలంకరించారు.1990 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన దయాసాగర్ తొలుత ఆదిలాబాద్ జిల్లాలో కానిస్టేబుల్‌గా విధులు ప్రారంభించారు.అనంతరం బెల్లంపల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. తరువాత జీఆర్పీ (రైల్వే పోలీస్) విభాగంలో కూడా సేవలందించారు. ప్రస్తుతం బదిలీ పై ములుగు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఏఎస్సైగా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ పదోన్నతి పొందిన దయాసాగర్‌కు అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు.పోలీస్ శాఖలో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ములుగు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డీఎస్పీ నలువాల రవీందర్, ఎస్ఐ బుట్ట చంద్రశేఖర్,జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొని పదోన్నతి పొందిన ఏఎస్సై దయాసాగర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే మురళి నాయక్ జన్మదిన వేడుకలు

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమ్మి గౌడ్ ఆధ్వర్యంలో



**కేసముద్రం,అక్టోబర్ 6 (జనం సాక్షి):** మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మి గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మురళి నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.మున్సిపల్ చైర్మన్ సునీత వెంకన్న,వైస్ చైర్మన్ అల్లం రమ నాగేశ్వరరావు, పీసీసీ సభ్యులు దస్రు నాయక్,ఆర్టిఏ మెంబర్ రావుల మురళి,జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి,బండారు వెంకన్న,కదిర సురేందర్,కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలి

### దుగ్గొండి ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక



**.దుగ్గొండి , అక్టోబర్ 6 (జనం సాక్షి):**ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో ప్రజా సమస్యల పరిష్కారంలో విలేకరుల పాత్ర గొప్పదని పత్రికా రంగంలో పనిచేసిన పాత్రికేయుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పట్టించుకోవాలని దుగ్గొండి ప్రెస్ క్లబ్ కన్వీనర్ పర్వపల్లి ప్రతాప్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాసిడి రాజిరెడ్డి అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరుల సంక్షేమం సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. దుగ్గొండి ప్రెస్ క్లబ్ కన్వీనర్ గా పర్వపల్లి ప్రతాప్, సంక్షేమ సంఘం అధ్యక్షులుగా కాసిడి రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా దొర్నాల రమేష్, ప్రధాన కార్యదర్శిగా గట్టికొప్పుల విజేందర్, ఉపాధ్యక్షులుగా రౌతు హరికృష్ణ, సహాయ కార్యదర్శిగా గోనె రాజు, కోశాధికారిగా తోకల శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా దొర్నాల రమేష్, సలహాదారులుగా సర్దార్, భాస్కర్, నరేందర్, సభ్యులుగా మోహన్, షరీఫ్, రఘోతం రెడ్డి, ఎన్ కిరణ్ కుమార్, ఏకాంబరం పాల్గొన్నారు .

# ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

- ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలి
- ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలోని వైద్య సేవలు, వసతులను పరిశీలించిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 6 (జనం సాక్షి) :**ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ )లోని వివిధ విభాగాల్లో విస్తృత తనిఖీలు చేసి గర్భిణీలు, బాలింతలు, మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని వసతులను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవల నిమిత్తం అక్కడికి వచ్చిన గర్భిణీ, బాలింతలతో కలెక్టర్ మాట్లాడి అందుతున్న వైద్య సేవలపైన అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ సేవలు, ఆరోగ్య మహిళా క్లినిక్, ఫెర్టిలిటీ క్లినిక్, ల్యాబొరేటరీ, గైనకాలజీ ఓపీ, స్కానింగ్ గది, స్టోర్ రూమ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఓపీ రిజిస్టర్లు, ల్యాబ్ రికార్డులను తనిఖీ చేశారు. ఓపీ వివరాలను ఆన్ లైన్ చేస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం వచ్చే గర్భిణులు, బాలింతలు ఎక్కువసేపు వేచి ఉండకుండా ఆరోగ్య పరీక్షల రిపోర్ట్‌లను వీలైనంత త్వరగా అందించాలని సూచించారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న అన్ని పరీక్షల రిపోర్టులను జాప్యం లేకుండా ఇవ్వాలన్నారు. ప్రసూతి, వైద్య సేవల్లో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. అవసరమైన మందులు, సామగ్రి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా .ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డ్యూటీ డాక్టర్‌లు కలెక్టర్ కి ఆసుపత్రి వివరాలను అలాగే అందిస్తున్న వైద్య సేవల గురించి కలెక్టర్ వివరించారు.

# ఇండోర్ స్టేడియంను పునః ప్రారంభించాలి

## జాతీయ స్థాయి పారా క్రీడ కారుడు సిద్దార్థ్ నాయక్



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 06 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని శివుని పెల్లిలో నమిలిగొండ వెళ్ళే మార్గం ఉన్న క్రీడ కారులకు శిక్షణ కోసం ఉన్న ఇండోర్ స్టేడియంను పునః ప్రారంభించాలని జాతీయ స్థాయి పారా క్రీడ కారుడు సిద్దార్థ్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ ఫౌండేషన్ వర్క్ ఐడి 1481 గల కల్గిన ఇండోర్ స్టేడియం-1ను పునః ప్రారంభించాలని ప్రారంభిస్తే ఘనపూర్‌లో ఉన్న గ్రామాలు ,పల్లెలు ,తండాల నుంచి కొన్ని వందల మంది క్రీడ కారులు చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఇండోర్ స్టేడియం ఉపయోగంలో లేకపోవడంతో క్రీడాకారులు శిక్షణలో వెనుకబడి పోతున్నారని అన్నారు. సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల క్రీడాకారులు రాష్ట్ర,జాతీయ స్థాయిలో వెనుకబడి పోతున్నారని స్టేడియంని తెరిచినట్లైతే స్టేషన్ ఘనపూర్ నుంచి కూడా క్రీడ కారులు తమ క్రీడ నైపుణ్యని బయటికి తీసుకు రావడం సులభం అవుతుందని, జనగామ జిల్లాలో అంతర్జాతీయ స్థాయిలకు వెళ్లిన క్రీడ కారులు ఉన్నారని ,క్రీడ కారులకు మంచి అవకాశం ప్రోత్సహించిన వారు అవుతారు అని అధికారులను కోరారు. సంబం ధిత అధికారులు స్పందించి అధికారులు గమనించి నమిలిగొండ వెళ్ళే రోడ్ లో ఉన్న ఇండోర్ స్టేడియంను మళ్ళీ తెరిచి కచ్చితంగా దానిని సరిచేసి పునః ప్రారంభించి క్రీడ కారులును గుర్తించాలని కోరారు.

# ఎస్ఐఆర్ ఫేజ్--2లో పరకాల రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

- ఎస్ఐఆర్ ప్రక్రియకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే
- గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలి



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 6 (జనం సాక్షి) :**మంగళవారం హనుమకొండ భవన్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఫేస్2 ప్రక్రియలో పరకాల నియోజకవర్గంలో ఓటర్ జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని అన్నారు. ఇందుకు సహకరించిన బిఎల్ఎలు, బిఎల్ఓలు, క్లస్టర్ ఇంచార్జిలు, మా మండల, పట్టణ, డివిజన్ అధ్యక్షులకు, కౌన్సిలర్లు, సర్పంచులు, గ్రామ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఐఆర్ ఫేజ్ 1 ప్రక్రియలో రాష్ట్రంలో 2వ స్థానం సాధించామన్నారు. మీ కృషివల్లే పరకాల నియోజకవర్గంలో 41 వేల 945 నోటీసులను పరిష్కారం చేసి, అర్హులను కాపాడగలిగామన్నారు. ప్రతి ఓటును కాపాడుకోవడం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని, ఓటు హక్కు లేనివారిని గుర్తించి కొత్త ఓటర్లు నమోదు చేసేలా ప్రోత్సహించాలన్నారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రాడ్యుయేట్స్ ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టుటపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి గారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. 2024 ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం లో 14,822 ఓట్లు ఉన్నాయన్నారు. పరకాల టౌన్ మరియు గీసుగొండ, సంగం మండల కేంద్రాలలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించాలని తెలిపారు. అలాగే గ్రామ, వార్డు స్థాయి పార్టీ పూర్తి కమిటీల నియామకం , ఫ్రంటల్ ఆర్గనైజేషన్ ఎన్నికల తీరుపై చర్చించారు.

# విద్యార్థినుల భద్రతే షీ బృందం లక్ష్యం




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాలతో భూపాలపల్లి కేజీబీవీ, కళాశాలలో షీ బృందం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. షీ బృందం ఎస్సై స్వప్నకుమారి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో తెలియని వ్యక్తులతో పరిచయాలు వద్దని, వ్యక్తిగత వివరాలు, చిత్రాలు, దృశ్యాలు పంచుకోవద్దని సూచించారు. వేధింపులు ఎదురైతే భయపడకుండా పోలీసులకు తెలపాలని, ఫిర్యాదుదారుల వివరాలు రహస్యంగా ఉంచుతామని చెప్పారు. ప్రయాణంలో టీ-సేఫ్ అనువర్తనం వాడుకోవాలని, అనుమానాస్పద లింకులు, క్యూఆర్ సంకేతాలు నొక్కవద్దని సూచించారు. ఇబ్బంది ఎదురైతే షీ బృందం - 8712658162, అత్యవసరానికి 112, అంతర్జాల మోసాలకు 1930 కు తెలుపాలని కోరారు. మంచి స్పర్శ-చెడు స్పర్శ, పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు.

# ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06(జనంసాక్షి ):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్సల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి పలు వార్డులలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరు, నిర్ణీత సమయంలో అందిస్తున్న మందులు, అల్పాహారం, భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఆసుపత్రిని సందర్శించిన సమయంలో లిఫ్ట్ పనిచేయడం లేదని, రోగులు ఇబ్బందులు పడుతున్నారని, తన దృష్టికి రాగా వెంటనే మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. అంతకుముందు ఆసుపత్రికి ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం, భోజనం అందించాలని తెలిపారు. క్యాంటీన్ లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, క్యాంటీన్ ఏర్పాటు చేయడం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు కిరణ్, వైద్యులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సుకు తరలిన మాదిగ స్టూడెంట్స్



**బచ్చన్నపేట అక్టోబర్ 6 ( జనం సాక్షి):** పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బచ్చన్నపేట మండల ఇంచార్జి పాకాల కుమారస్వామి మాదిగ ముఖ్య అతిథులు గా ఎం ఆర్ పిఎస్ మండల అధ్యక్షులు బంధారపు నరేష్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ లో జరుగబోయే రెండు తెలుగు రాష్ట్రాల ఎంఎస్ ఎఫ్ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ సదస్సు కు బచ్చన్నపేట ఎం ఎస్ సి ఎఫ్ స్టూడెంట్స్‌ని మండలం నుండి తరలించారు. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట మండల ఎమ్మార్పీఎస్ ఆధికార ప్రతినిధి ఆల్వాల రాజేష్ మాదిగ, మండల సీనియర్ నాయకులు అల్వాల అనిల్ కుమార్ మాదిగ, ఎంఎస్‌పి మండల నాయకులు కర్రే శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్ఎఫ్ ఎంఎస్‌పి నాయకులు అల్వాల శ్రీకాంత్ మాదిగ, మేడి కళ్యాణ్ మాదిగ, అల్వాల నిఖిల్ కుమార్ మాదిగ, కర్రే విజయ్ మాదిగ, గుడ్ల అఖిల్ మాదిగ, అల్వాల శ్రీధర్ మాదిగ పాల్గొన్నారు.

# మంత్రి వివేక్, అతని తనయుడు ఎంపీ వంశీకృష్ణ తమ పద్ధతిని మార్చుకోవాలి

### జగన్మోహన్ రావు వర్గాన్ని కాంగ్రెస్ నుండి బహిష్కరింపజేస్తాం

### మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 6 జనంసాక్షి:**:కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అతని తనయుడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తమ పద్ధతిని మార్చుకోవాలని లేనిపక్షంలో జగన్మోహన్ రావు వర్గాన్ని కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరింపజేస్తామని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు.మంగళవారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రేమ సాగర్ వర్గీయులు,మేయర్ మాట్లాడుతూ....ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దగ్గర కుట్ర రాజకీయ పప్పులు ఉడకవని, మిత్రపక్షంతో పాటు ప్రతిపక్షాలు కూడా ఎమ్మెల్యేపై దాడి చేస్తున్నాయని అన్నారు. మంచిర్యాల అభివృద్ధిలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేని మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీ కృష్ణ వర్గ పోరుకు తెరలేపారని, ఇంతవరకు కాంగ్రెస్ కండువా కప్పుకోలేని మంతెన జగన్మోహన్రావు కాంగ్రెస్ పార్టీ ని విచ్ఛిన్నం చేసే కుట్రకు తెరలేపడం సహించరాని విషయమని, దీనిపై అధిష్టానానికి ఫిర్యాదు చేసి ఈ వర్గాన్ని కాంగ్రెస్ నుండి బహిష్కరించేలా తమ కార్యచరణ ఉంటుందని వారు తెలిపారు. కాంగ్రెస్ ఇంచార్జ్ మంత్రికి, రాష్ట్ర పీసీసీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎంపీ లాడ్స్ నిధులు కేవలం ఒకటి , రెండు డివిజన్ లకు ఇస్తే సరిపోదని , అన్ని డివిజన్ ప్రజలు ఓటేస్తేనే గెలిచారని అన్నారు. కార్పొరేషన్లో ఆ వర్గం చేసే కార్యక్రమాలకు ప్రథమ పౌరుడు మేయర్, డిప్యూటీ మేయర్తో పాటు ఏఎంసీ చైర్మన్ ఫోటోలు ఫ్లెక్సీలో పెట్టకపోవడం తీవ్ర అభ్యంతరకరమని వాఖ్యానించారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీ చర్యలపై వారు మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో లేని 10 ఏళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ని బతికించిన ఘనత ప్రేమ్ సాగర్ రావు ఉందని, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పాదయాత్ర,ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మీటింగ్, ఇంద్రవెల్లి సభ ఇలా కాంగ్రెస్ పార్టీ కి ఎన్నో కార్యక్రమాలు చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచులను, కార్పొరేటర్లను భయబ్రాంతాలకు గురిచేస్తూన్నారని, ప్రేమ్ సాగర్ రావు ఎదురుగా ఎదురుకుని డీ కొట్టే ధైర్యం లేక ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సరికాదని పేర్కొన్నారు.మంచిర్యాల అభివృద్ధిని శరవేగంగా చేయిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తూముల నరేష్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు పూదరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు

# బుగ్గ దేవస్థానం ట్రస్ట్ బోర్డు నోటిఫికేషన్‌కు బ్రేక్



**బెల్లంపల్లి, అక్టోబర్ 6, (జనంసాక్షి)**బెల్లంపల్లి మండలంలోని కన్నాల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి నూతన ట్రస్టు బోర్డు నియామకానికి ఇటీవల దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రక్రియను రాష్ట్ర హైకోర్టు నిలిపివేసింది. సెప్టెంబర్ 27న రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి నోటిఫికేషన్ విడుదలైంది. అక్టోబర్ 1న బుగ్గ దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి ఒక పత్రికలో నోటిఫికేషన్ ప్రచురణ విడుదలైంది. ఇదే నోటిఫికేషన్ ప్రకటన దేవస్థానం పరిధిలోగల మంచిర్యాల జిల్లాలోని ఏదేని ఒక తెలుగు దినపత్రికలో ప్రచురించాలని దేవాదాయ శాఖ కమిషనర్ స్థానిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయ అధికారులు జిల్లా స్థాయిలో నోటిఫికేషన్ ప్రకటనను ఏ పత్రికలో ప్రచురించకుండా నిర్లక్ష్యం చేశారు. వారి కార్యాలయం నుండి జారీ చేసిన ప్రతులను నియోజకవర్గంలోని తాండూర్, బెల్లంపల్లి, వేమనపల్లి, నెన్నల్, కాసిపేట, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా కనిపించేలా అంటించలేదనే ఆరోపణలున్నాయి. బెల్లంపల్లిలో పరిమిత ప్రభుత్వ కార్యాలయాల్లోనే సమాచార ప్రతులను అంటించినట్లు తెలుస్తుంది. ఈ వ్యవహారంతో పాటు బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో ఉన్న శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తాండూర్ మండలం కరిశలగూడెం (కరిశల ఘట్టం) గ్రామ రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉందని, ఈ దేవస్థానాన్ని తాండూర్ మండల పరిధిలోకి మార్చిన తర్వాతే ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, బుగ్గ దేవస్థానం మాజీ చైర్మన్ మాసాడి శ్రీదేవి, పెరుమాండ్ల రమేష్, ద్వారక కాసిపేట గ్రామానికి చెందిన సుంకరి రాజేశ్వరి, ద్వారకాపూర్ గ్రామానికి చెందిన ఎల్లాకుల రవికుమార్ ఈనెల 1న రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. వీరి ఫిర్యాదులపై స్పందించిన హైకోర్టు నోటిఫికేషన్ విడుదలపై స్థానికంగా సమాచారం అందించడంలో లోపం జరిగిందని, బుగ్గ దేవస్థానం తాండూర్ మండలం కరిశెలగూడెం గ్రామ పరిధిలోకి వచ్చే అంశాన్ని పరిగణనలోకి తీసుకొని విచారించాలని ఆదేశిస్తూ ఈ కేసును నవంబర్ 4 వాయిదా వేసినట్లు తెలుస్తుంది. ఈ విషయమై శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన కార్యనిర్వహణ అధికారి గుర్రాల బాపురెడ్డిని వివరణ కోరగా ట్రస్ట్ బోర్డు నోటిఫికేషన్ ను హైకోర్టు నిలిపివేసింది వాస్తవమేనని చెప్పారు. దేవస్థానం తాండూర్ మండల పరిధిలోకి వచ్చే అంశాన్ని పరిగణనలోకి తీసుకుందని, దీనిపై ఎలాంటి అభ్యంతరాలున్నా తమ వాదనలు వినిపించాలని దేవాదాయశాఖకు సూచించినట్లు తెలిపారు.

# సాంకేతిక, ఎం ఆర్ టీ, రెవెన్యూ, కమర్షియల్ అంశాలపై సమగ్ర సమీక్ష

### అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి మెరుగైన సేవలు అందించాలి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06(జనంసాక్షి ):**విద్యుత్ పంపిణీ వ్యవస్థ పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కొమరం భీమ్ ఆసిఫాబాద్ ఎస్ఈ ఉత్తమ్ జాడే సూచించారు. మంగళవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ ఏ ఓ, డీఈ టెక్నికల్, ఎస్ఓలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్కిల్ పరిధిలోని సాంకేతిక, ఎం ఆర్ టీ, రెవెన్యూ, కమర్షియల్ విభాగాలకు సంబంధించిన వివిధ అంశాలను సమగ్రంగా సమీక్షించారు. విద్యుత్ సరఫరా నాణ్యత, ఫీడర్ల పనితీరు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థితిగతులు, విద్యుత్ నష్టాలు, రెవెన్యూ వసూళ్లు, కమర్షియల్ అంశాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు వివరాలను సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని, ఫెయిల్ అయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు, సాంకేతిక సమస్యలపై తక్షణమే స్పందించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశానికి డీఈఈలు, ఏడీఈలు, ఏఏఓ/ఈఆర్ఓ, ఏఈలు, ఆపరేషన్స్, ఎంఆర్‌టీ, కమర్షియల్, టెక్నికల్ విభాగాల సబ్-ఇంజినీర్లు, జేఏఓలు, సీనియర్ అసిస్టెంట్లు హాజరయ్యారు.

# నకిలీ సందేశాలకు ఎవరూ స్పందించవద్దు

### ప్రజలు,అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి,అక్టోబర్6(జనం సాక్షి):–** ములుగు జిల్లా కలెక్టర్ పేరు,ఫొటోను ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు పంపుతున్న నకిలీ వాట్సాప్ సందేశాలకు ఎవరూ స్పందించవద్దని,ప్రజలు, అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.తన పేరు, ఫొటోను వాట్సాప్ డిపి లో పెట్టుకుని o66 98 476 2993 నంబర్ నుంచి అధికారులకు సందేశాలు పంపుతున్నట్లు గుర్తించామని తెలిపారు.ఈ నంబర్ నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని,వెంటనే సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, వాట్సాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.తన పేరు,ఫొటో కనిపించినంత మాత్రాన అపరిచిత నంబర్ల నుంచి వచ్చే సందేశాలను విశ్వసించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.అలాంటి సందేశాల ద్వారా డబ్బులు,బహుమతి కార్డులు అడిగినా స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, రహస్య సంకేత సంఖ్యలను ఎవరికీ ఇవ్వవద్దని కోరారు.సైబర్ నేరగాళ్లు ప్రముఖుల పేర్లు, ఫొటోలను ఉపయోగించి ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. తన పేరుతో అనుమానాస్పద సందేశాలు వస్తే సంబంధిత సైబర్ నేరాల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రజలు, అధికారులు, సిబ్బంది జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# ఎయుపిఎస్ బయ్యక్కపేట పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



**ఏటూరునాగారం,అక్టోబర్6(జనం సాక్షి):–**బయ్యక్కపేటలోని గిరిజన సంక్షేమ ప్రాథమికోన్నత పాఠశాల (ఎయుపిఎస్)ను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి పాఠశాలలోని విద్యా పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పీఓ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల నోట్‌బుక్స్, అభ్యసన స్థాయి, విద్యా ప్రగతిని పరిశీలించి, పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహనను తెలుసుకున్నారు.విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, డార్మిటరీ తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పాఠశాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు తరగతి బోధన, విద్యార్థుల అభ్యసన ప్రగతి, హాజరు మరియు పాఠశాల నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలని పీఓ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

# అర్హులైన ప్రతి మహిళకి కుట్టు మిషన్లు అందించాలి

### తెలంగాణ టైలర్స్ జెఏసి చైర్మన్ గాలి తిరుపతి



**బచ్చన్నపేట అక్టోబర్ 6 ( జనం సాక్షి) :** తెలంగాణ వ్యాప్తంగా దరఖాస్తులు చేసుకున్న ప్రతి మహిళకు కుట్టు మిషన్ విధిగా అందించాలని తెలంగాణ టైలర్స్ జేఏసీ చైర్మన్ గాలి తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ టైలర్ వృత్తి పై ఎంతోమంది కార్మికులు బట్టలు కుడుతూ నిత్యం ఉపాధి పొందుతున్నారన్నారు. వారందరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దరఖాస్తు చేసిన ప్రతి మహిళకు కుట్టు మిషన్లు అందించాలని కోరారు. టైలర్లకు 50 ఏళ్లకే పింఛన్ వర్తింపజేయాలని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల టైలర్లు మహిళలు పాల్గొన్నారు

# అభివృద్ధికి కలలుగంటున్న” కాటారం “ నెరవేర్చాలని డివిజన్ ప్రజలకు వేడుక

- ఒకప్పుడు నాలుగు మండలాలకు ప్రధాన వ్యాపార కేంద్రం
- నేడు వెలవెలబోతున్న వాణిజ్య సముదాయం




**కాటారం అక్టోబర్ 6( జనం సాక్షి ):** ఒకప్పుడు నాలుగు మండలాల ప్రజలకు ప్రధాన వాణిజ్య కేంద్రంగా కళకళలాడిన కాటారం నేడు అభివృద్ధి కోసం ఎదురుచూస్తోంది. 1985 నుంచి క్రమంగా వ్యాపార కేంద్రంగా ఎదిగిన కాటారం.. కాలక్రమేణా చుట్టుపక్కల మండలాల ప్రజలకు అవసరమైన ప్రతి వస్తువు లభించే ప్రధాన కేంద్రంగా గుర్తింపు పొందింది. వ్యాపారాలు విస్తరించడంతో రహదారికి ఇరువైపులా షాపింగ్ కాంప్లెక్సులు, భారీ భవనాలు వెలిశాయి.

**పెట్టుబడులు పెట్టి.. నష్టాల్లో వ్యాపారులు**

కాటారం మరింత అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తులో పరిశ్రమలు ఏర్పడతాయని ఆశించిన పలువురు వ్యాపారులు భారీగా పెట్టుబడులు పెట్టారు. షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించి వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించారు. అయితే ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగకపోవడంతో ప్రస్తుతం వ్యాపారాలు మందగించాయి. పెట్టుబడులు పెట్టిన వ్యాపారులు నష్టాలను చవిచూస్తూ కొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**భూములు కొన్న ప్రజలకు నిరాశే మిగిలింది**

కాటారం చుట్టుపక్కల మల్హార్, మహాముత్తారం, మహదేవపూర్ తదితర మండలాల ప్రజలు భవిష్యత్తులో భూముల ధరలు పెరుగుతాయని ఆశించి ఇక్కడ భూములు కొనుగోలు చేశారు. కొందరు తమ పిల్లల భవిష్యత్తు, ఆడపిల్లల పెళ్లిళ్లు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో భూముల్లో పెట్టుబడులు పెట్టారు.

అయితే వ్యాపార కేంద్రంగా కాటారం ప్రాధాన్యం తగ్గడంతో భూముల ధరలపైనా ప్రభావం పడింది. ఒకప్పుడు రోజురోజుకూ పెరుగుతాయని భావించిన భూముల విలువలు ప్రస్తుతం తగ్గుముఖం పట్టడంతో పెట్టుబడిదారులు ఆందోళన చెందుతున్నారు.

**మూడు దశాబ్దాలుగా ఇదే ఎదురుచూపు**

ముప్పై సంవత్సరాల క్రితం కాటారం అభివృద్ధి చెందుతున్న తీరును



చూసి ప్రజల్లో ఎన్నో ఆశలు చిగురించాయి. పరిశ్రమలు వస్తాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, భూముల విలువలు పెరుగుతాయని ఆశించారు. కానీ కాలం గడుస్తున్న కొద్దీ ఆ ఆశలు నిరాశగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పరిశ్రమ వస్తేనే పూర్వ వైభవం**

కాటారం ప్రాంతంలో విశాలమైన భూభాగం అందుబాటులో ఉండటంతో పాటు నీటి వనరులు, బొగ్గు నిక్షేపాలు సమీపంలో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితులను అనుకూలంగా మలుచుకుని ప్రభుత్వం పరిశ్రమలను ఏర్పాటు చేస్తే కాటారం మళ్లీ అభివృద్ధి బాట పట్టే అవకాశం ఉందని ప్రజలు ఆశిస్తున్నారు. పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు వ్యాపారాలు కూడా పుంజుకుంటాయని, రియల్ ఎస్టేట్ రంగం తిరిగి కోలుకుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రభుత్వ చొరవపై ప్రజల ఆశలు**

కాటారం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మౌలిక వసతులను మెరుగుపరిచి, పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షిస్తే కాటారం మరోసారి నాలుగు మండలాలకు ప్రధాన వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని వారు విశ్వసిస్తున్నారు. ఇన్నేళ్లుగా పెట్టుబడులు పెట్టి అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న కాటారం ప్రజల ఆశలు ఇకనైనా నెరవేరాలని ప్రజలు వ్యాపారస్తులు యువత వేడుకుంటున్నారు.

# ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

## ఎస్ఐఆర్ రద్దు, సీఈసీ రాజీనామా, బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికల నిర్వహణపై వెనక్కి తగ్గేది లేదు

## ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06(జనంసాక్షి ):** ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన మూడు ప్రధాన అంశాలపై ఇండియా కూటమి వైఖరి స్పష్టంగా ఉందని కొమరం భీమ్ ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటరు జాబితా సవరణకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, ఈవీఎం లకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సేవ్ డెమోక్రసీ వీక్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కొమరం భీమ్ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ గేట్ ముందు ధర్నా చేపట్టారు. మాజీ డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, నియోజకవర్గం ఇంచార్జి శ్యాంనాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ దేశంలో ఓటు చోరీ జరుగుతోందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఓటు చోరీ ద్వారానే బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిందనే ఆరోపణలపై కూడా విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు.ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడాన్ని వెంటనే నిలిపివేయాలని, అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించకూడదని అన్నారు. ఎన్నికల సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా కాకుండా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.ఎన్నికల వ్యవస్థపై ప్రతిపక్ష పార్టీలు నిరసనలు, పోరాటాలు చేస్తున్నప్పటికీ తెలంగాణలో బీ అర్ ఎస్ పార్టీ ఈ అంశాలపై స్పందించకపోవడం బాధాకరమని సుగుణక్క విమర్శించారు. బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టుగా కనిపిస్తోందని ఆరోపించారు.ఇది కాంగ్రెస్ పార్టీ లేదా ఇండియా కూటమి కోసం మాత్రమే చేస్తున్న పోరాటం కాదని, దేశంలోని ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు చేస్తున్న పోరాటమని సుగుణక్క అన్నారు. ఓటును కాపాడాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఇండియా కూటమి నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గద్దె దిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఓటు హక్కుపై జరుగుతున్న దాడులను అడ్డుకుని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను సాధించే వరకు వెనక్కి తగ్గబోమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఇండియా కూటమి నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, నియోజకవర్గం ఇంచార్జి శ్యాంనాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు,ఎజూఎ పార్టీ జిల్లా కార్యదర్శివర్గం సభ్యులు దుర్గం జీనకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్,గెడం టీకానంద్, నిఖిల్,తిరుపతి,మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు రాపర్తి మురళి,పట్టణ అధ్యక్షులు ఇమ్రాన్,ఎస్సి సెల్ జిల్లా చైర్మన్ సద్దాల శ్రీనివాస్, అన్ని మండలాల అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గం సభ్యులు,సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు,ఇండియా కూటమి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



**కాళేశ్వరం ,అక్టోబర్ 6 ,( జనం సాక్షి).** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం పలుగుల గ్రామ పంచాయతీ పరిధిలో ఎలిప్స్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం పూర్తయింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. మహిళలు ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కుట్టు మిషన్ శిక్షణ అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు సర్టిఫికెట్లను ఉపయోగించుకుని బ్యాంకు రుణాలు, వివిధ స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. కుట్టు మిషన్లతో పాటు పేపర్ ప్లేట్ల తయారీ వంటి ఇతర ఉపాధి అవకాశాలను కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. మారుమూల ప్రాంతమైన పలుగులలో మహిళలకు శిక్షణ అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారే విజయలక్ష్మి, శంకర్, వార్డు సభ్యులు, ఎమ్మెస్ సెమీ కౌన్సిలర్ రజిత, ట్రైనర్ కోరుకోప్పుల మమత, గ్రామస్తులు, శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఫకిర్ నాయక్ తాండలో పోషణ మాసం వేడుకలు



**సిరికొండ అక్టోబర్ 05 ( జనంసాక్షి) :** సిరికొండ మండలం ఫకిర్ నాయక్ తాండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్బంగా సర్పంచ్ రాథోడ్ సరోజన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమతుల, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారంతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, ఆశాలు, గర్భిణులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# పార్కింగ్ నిబంధనల ఉల్లంఘనలపై విచారణ జరపాలి అప్ నేత సయ్యద్ హైదర్



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 06,(జనంసాక్షి )** పట్టణంలోని షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆప్ నాయకులు నిర్మల్ కలెక్టరేట్‌లో ఏ.ఓ. ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆనంద్, చెన్నై, మాంగళ్య, ఎల్‌వీఆర్, చందన బ్రదర్స్ తదితర షాపింగ్ మాల్స్‌లో సరైన పార్కింగ్ వసతి లేకపోవడంతో వాహనాలను రోడ్లు, ఫుట్‌పాత్‌లపై నిలుపుతున్నారని తెలిపారు. దీంతో ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి, పార్కింగ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆప్ జిల్లా జనరల్ సెక్రటరీ సీహెచ్ వినోద్‌కుమార్, ట్రెజరర్ అబ్దుల్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

# బడి గంట మోగక ముందే తాళం

## కుంటాల జెడ్పీఎచ్ఎస్ ఉపాధ్యాయుల నిర్లక్ష్యం!

ప్రభుత్వ ఆసుపత్రిలో సాయి భోజన్

:ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం నిర్దేశిత సమయాలను అమలు చేస్తోంది. అయితే, క్షేత్రస్థాయిలో కొందరు ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయాలు నీరుగారుతున్నాయి. తాజాగా కుంటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-కుంటాల ఉపాధ్యాయుల తీవ్ర నిర్లక్ష్యం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు సాయంత్రం 4:15 గంటల వరకు కొనసాగాల్సి ఉంది. విద్యార్థులు పూర్తి సమయం పాఠశాలలో గడిపేలా చూడటం, ఉపాధ్యాయులు అందుబాటులో ఉండటం విధిగా పాటించాలి. కానీ, కుంటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడి గంట మోగక ముందే, నిర్దేశిత సమయం కంటే ముందే ఉపాధ్యాయులు పాఠశాలకు తాళాలు వేసి వెళ్ళిపోయినట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం




చేస్తున్నారు.బడి వేళలు ముగియక ముందే పాఠశాల గేట్లకు తాళం పడటాన్ని గమనించిన పలువురు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన గురువులే ఇలా సమయం కాకముందే జారుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఇలాంటి వారిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో సాయి భోజన్

**బెల్లంపల్లి, అక్టోబర్ 6, (జనంసాక్షి)**బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కాంపల్లి త్రయాక్షర్ జన్మదినం సందర్భంగా త్రయాక్షర్ కుటుంబీకుల ఆర్థిక సహకారంతో గర్భిణులకు, బాలింతలకు, డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ - రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని గర్భిణీలు, బాలింతలు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి, దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రస్ట్ ద్వారా ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం, అన్నదానంతో తృప్తి పరుద్దాం అని ట్రస్ట్ వ్యవస్థాపకులు పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు జేరిపోతుల




చంద్రకళ, సేవకులు పోతురాజుల తిరుపతి, కొంక రవికుమార్, కాంపల్లి త్రయాక్షర్, కాంపల్లి శ్రవిద్య, బొద్దున శ్రీ హర్షిత్, సంజీవ్, భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు. బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునేవారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# ఏఐటీయూసీలోకి భారీగా యువ కార్మికుల చేరిక

**నస్పూర్(జనంసాక్షి):**ఏరియాలో ఏఐటీయూసీ--ఎస్‌సీడబ్ల్యూయూలోకి 465 మంది యువ కార్మికులు చేరారు. ఎస్ఆర్పీ--3 గనిలో 309 మంది,ఎస్ఆర్పీ--1 గనిలో 156 మంది యువ కార్మికులు మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లలో యూనియన్‌లో చేరారు.నాయకులు మురళీ చౌదరి,దాడి రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య,ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్,డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య,ముస్కే సమ్మయ్య కొత్తగా చేరిన కార్మికులకు కండువాలు కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాల ఫలితంగా 24 ప్రధాన డిమాండ్లపై ఒప్పందం సాధించామని తెలిపారు.ఒప్పందాలను అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.యువ కార్మికులకు యూనియన్‌లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించి నాయకత్వ అవకాశాలు



కల్పిస్తామని పేర్కొన్నారు.సింగరేణిలో కొత్త గనులను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రాచర్ల చంద్రమోహన్,బద్రి బుచ్చయ్య,అడ్డు శ్రీనివాస్,అఫ్రోజ్ ఖాన్, రాజ్ కుమార్,అంబాల రవి,కారుకూరి నగేష్,తౌటం మల్లేష్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 10 శాతం లాభాల వాటాను కేటాయించాలి

**బెల్లంపల్లి, అక్టోబర్ 6, (జనంసాక్షి)**సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల వాటాని కేటాయించాలని మంగళవారం ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సివిల్ కార్యాలయంలో సివిల్ సూపర్వైజర్ రాజయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డిచరణ్ మాట్లాడుతూ గత సంవత్సరం సింగరేణి యాజమాన్యం పర్మనెంట్ కార్మికులకు 34 శాతం లాభాల వాటాను చెల్లించింది. ఒక్కొక్కరికి 1,96,000 లాభల వాటా పంచింది. కానీ పర్మనెంట్ కార్మికులతో సమానంగా పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు కేవలం 5500 రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకున్నదన్నారు. సింగరేణి యాజమాన్యం కాంటాక్ట్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లించడం వల్ల సింగరేణి యాజమాన్యానికి లాభాలు వస్తున్నాయి ఒక పర్మినెంట్ కార్మికునికి చెల్లించే వేతనంతో పదిమంది కాంట్రాక్ట్ కార్మికులను పెట్టుకోవచ్చన్నారు. వేతనాలలో తేడా ఉందని, ఒక పర్మినెంట్ కార్మికునీ స్థానంలోపదిమంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. సింగరేణి యాజమాన్యానికి లాభాలు




వస్తున్నాయి, వచ్చే లాభాలలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ చెమట చుక్కలు దాగి ఉన్నాయని, కాంట్రాక్టు కార్మికులకు10 శాతం లాభాల వాటాను పంచాలని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, ఆనంద్, శ్యామ్, గణేష్, వెంకటేష్, కిరణ్,అరుణ్, పద్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలి

### నాన్ పర్మినెంట్ కార్మికులకు డీఏ,ఉద్యోగ భద్రత కల్పించాలి

### సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్




**నస్పూర్ (జనంసాక్షి):**కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లతో పాటు తక్కువ వేతనాలు పొందుతున్న ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనం రూ.30 వేలుగా నిర్ణయించి చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. నాన్ పర్మినెంట్ ఉద్యోగులు,కార్మికులకు డీఏ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.మంగళవారం శ్రీరాంపూర్ సీఐటీయూ కార్యాలయంలో గోమాస ప్రకాష్ అధ్యక్షతన జరిగిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పీఆర్సీ కాలపరిమితి 2023 జూలైలో ముగిసినా వేతన సవరణలో జాప్యం జరుగుతోందన్నారు.పీఆర్సీ పరిధిలో లేని ఉద్యోగులు, కార్మికులను కూడా పరిధిలోకి తీసుకొచ్చి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లపై అక్టోబర్ 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీఆర్సీ రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.అక్టోబర్ 25, 26 తేదీల్లో ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మహాధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.అలాగే లేబర్ కోడ్ల రద్దు డిమాండ్‌తో డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్,జిల్లా సహాయక కార్యదర్శి దాగం రాజారాం, జిల్లా కమిటీ సభ్యులు చల్లూరి దేవదాస్, కావేరి రవి తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణి సంరక్షణపై అవగాహన సదస్సు



**నెన్నెల, అక్టోబర్ 6 (జనంసాక్షి)**వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకొని మంచిర్యాల రేంజ్ అటవీశాఖ ఆధ్వర్యంలో ఆవడం, గంగారాం గ్రామాల్లో ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అటవీ జంతువుల ప్రాధాన్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర, వన్యప్రాణులను రక్షించాల్సిన బాధ్యతపై గ్రామస్తులకు అధికారులు అవగాహన కల్పించారు.అటవీ జంతువులు ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, అడవులను రక్షించడంతో పాటు వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అడవుల్లో వన్యప్రాణులు ఎదురైతే వాటిని ఇబ్బందులకు గురిచేయకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆవడం సెక్షన్ ఆఫీసర్ సి. రేవతి, బీట్ అధికారి జి. శ్రావణ్ కుమార్‌తో పాటు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా పాల్గొని వన్యప్రాణుల సంరక్షణకు తమ వంతు సహకారం అందించాలని అధికారులు కోరారు.

## బీమా ఉంటేనే కుటుంబానికి ధీమా

### సిఐ భరత్ సుమన్

**పాలకుర్తి. అక్టోబర్ 06 (జనంసాక్షి)** బీమా ఉంటేనే ప్రతి కుటుంబానికి ధీమా ఉంటుందని పాలకుర్తి సీఐ భరత్ సుమన్ అన్నారు. మండలం లోని ముత్తారం గ్రామానికి చెందిన పొర్ల మల్లయ్య గత కొన్ని రోజుల




క్రితం కరెంట్ షాక్ తో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం ఉండగా. ఇన్సూరెన్స్ బ్రాంచ్ వారు పొర్ల మల్లయ్య కుటుంబానికి 6 లక్షల 72 వేల చెక్కును సిఐ భరత్ సుమన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సిఐ భరత్ సుమన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ బీమా తప్పనిసరిగా చేసుకోవాలని. బీమా ఉంటేనే ఆ కుటుంబానికి ధీమా ఉంటుందని అన్నారు, , ఈ కార్యక్రమంలో, వరంగల్ బ్రాంచ్ మేనేజర్, వినయ్ గౌడ్ శ్రీరామ్ ఏజెంట్ గజ్జి రాజు, సర్పంచ్ చింతకింది అనిత. తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలను ఉధృతం చేస్తాం

## అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయలు అందివ్వాలి

## కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్.



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06(జనంసాక్షి ):** కుల వివక్షకు వ్యతిరేకంగా, దళితులు, గిరిజనులు, పేదల హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, అవసరమైన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వాంకిడి మండలం కిరిడి గ్రామంలో కెవిపిఎస్ వాంకిడి మండల కార్యదర్శి వడ్లూరి నగేష్ జెండా ఆవిష్కరణ చేశారు ఈ కార్యక్రమానిక కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దేనికర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

**62 రకాల కుల వివక్షలను వెలుగులోకి తెచ్చిన ఉద్యమం:**

1998 అక్టోబర్ 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న 62 రకాల కుల వివక్ష రూపాలు వెలుగులోకి వచ్చాయని నాగార్జున తెలిపారు. ఈ వివక్షలకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల ఫలితంగా అసెంబ్లీలో చర్చ జరిగి, వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధించి 106 ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నిధుల కేటాయింపు, దళితుల స్మశాన వాటికలకు భూమి కేటాయింపు వంటి అంశాల్లో సంఘం పోరాటాలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. జస్టిస్ పున్నయ్య కమిషన్, కోనేరు రంగారావు కమిటీ సిఫారసుల అమలుతోపాటు దళితులు, గిరిజనులు, పేదల హక్కుల కోసం కెవిపిఎస్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. అయినప్పటికీ నేటికీ కులం పేరుతో దూషణలు, దాడులు, హత్యలు, కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై దాడులు కొనసాగడం ఆందోళనకరమన్నారు. భూమి, గట్టు వంటి వివాదాల్లోనూ దళితులు వివక్షను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..

**సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించాలి:**

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచడంతోపాటు నాణ్యమైన భోజనం, దుస్తులు, ప్లేట్లు, గ్లాసులు, తాగునీరు, ఇతర కనీస సౌకర్యాలు కల్పించాలని దినకర్ డిమాండ్ చేశారు. హాస్టళ్ల నిర్వహణకు సరిపడా నిధులు కేటాయించకుండా విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విద్యార్థుల విద్యా హక్కులను పరిరక్షించాలని కోరారు. కుల వివక్షకు తోడు పేదరికం, నిరుద్యోగం దళితుల జీవితాలను మరింత దుర్భరంగా మారుస్తున్నాయని తెలిపారు. దేవాలయాల్లో ప్రవేశం నుంచి ఉద్యోగ ప్రదేశాల వరకు వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులు ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

**రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత:**

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు దళితులు, గిరిజనులు, పేదలకు పూర్తిస్థాయిలో అందడం లేదని పేర్కొన్నారు. బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవడంతో సంక్షేమ కార్యక్రమాలు నీరుగారుతున్నాయని విమర్శించారు. ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లు తొలగించకుండా ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉండాలని కోరారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. చదువు ద్వారానే విజ్ఞానం, సామాజిక చైతన్యం పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేసి, కుల వివక్షకు, మతం పేరుతో జరిగే మారణహోమాలకు వ్యతిరేకంగా ప్రశ్నించే గొంతుకలుగా ఎదగాలని పిలుపుని దళితుల హక్కులు, సంక్షేమం, సామాజిక సమానత్వం సాధించే వరకు కెవిపిఎస్ పోరాటాలు కొనసాగుతాయని నాగార్జున స్పష్టం చేశారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారం, విద్యార్థులకు మెరుగైన వసతులు, బడ్జెట్‌లో తగిన నిధుల కేటాయింపు, నిరుద్యోగులకు ఉపాధి కల్పన వంటి డిమాండ్ల సాధన కోసం జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు మల్లేష్ కైలాష్,మనోహర్,శ్యామ్ రావు సంతోష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జాడి తిరుపతి డివైఎఫ్ఐ మండల కార్యదర్శి వడ్లూరి శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి




**దుగ్గొండి, అక్టోబర్ 6 (జనం సాక్షి):** ఎలినినో ప్రభావం వల్ల చెరువులో, నీరు లేకపోవడం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడి మండలంలో కరువు చాయలు నెలకొనడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దుగ్గొండి మండల సభ డిమాండ్ చేసింది. మంగళవారం దుగ్గొండి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావు ఎంపీడీవో అరుంధతి, తహసిల్దార్ సమ్మక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు గ్రామీణ ప్రాంతాలు పశువులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి నివారణకు పశువుల తొట్లు నిర్మించాలని, అదేవిధంగా గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ వర్షాభావ పరిస్థితులలో చెరువుల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదైనట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. దుగ్గొండి ఎంపీడీవో అరుంధతి మాట్లాడుతూ మండలంలో నూతనంగా 941 పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పన కోసం చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులు మిస్ మ్యాచింగ్ జరిగితే అధికారులను సంప్రదించి సరిదిద్దుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు సర్పంచులు శంకేషి కమలాకర్ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



# గోశాల, వేద పాఠశాలకు స్థలం కేటాయించాలని వినతి



**బెల్లంపల్లి, అక్టోబర్ 6, (జనంసాక్షి)** బెల్లంపల్లి పట్టణంలో గోశాల, వేద పాఠశాల కోసం స్థలం కేటాయించాలని మంగళవారం బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. స్థలం కేటాయిస్తే గాయత్రీ మాతా ఆలయం, గౌశాల, యాగశాల, వేద పాఠశాలకు అనుకూలంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థలం లేకపోవడం వల్ల బ్రాహ్మణ కుటుంబాలు ఏదైనా కార్యక్రమాలు చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, అందరితో పాటు తమ సంఘానికి కూడా ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఇది వరకు ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు, అన్నీ రాజకీయ పార్టీల నాయకులు సానుకూలంగా స్పందించి తమ వంతుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు విఎల్ఎస్ శ్రీనివాస్ రావు, కోశాధికారి జగన్మోహనాచారి, సలహాదారుడు రాంభట్ల హరీష్ శర్మ, ఇతర ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

# సాల్వజీ మహేందర్ రావు జన్మదిన వేడుకలు

## రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ



**తాండూర్, అక్టోబర్ 06(జనం సాక్షి)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ సాల్వజీ మహేందర్ రావు జన్మదిన వేడుకలు తాండూరులో మంగళవారం ఘనంగా జరిగాయి. తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పెద్దబోయిన శంకర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు ప్రభుత్వ హాస్పిటల్ డాక్టర్ ఝాన్సీరాణి, మండల కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్లు శంకర్ గౌడ్, షేక్ మోమిన్ అలీ, ప్రధాన కార్యదర్శులు నవీన్ పటేల్, కటికల మల్లేష్ పాల్గొన్నారు. అలాగే పార్టీ కార్యదర్శులు ప్రభాకర్, జైన సాంబయ్య, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మాస వెంకటస్వామి, కార్యదర్శి దుర్గం మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కామని శ్రీనివాస్, కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకన్న, కోశాధికారి మద్దికుంట చందు ఈ వేడుకల్లో భాగస్వామ్యమయ్యారు. వీరితో పాటు మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పుట్ట శ్రీను, మాజీ జడ్పీటీసీ బండి పోషం, సీనియర్ నాయకులు వెంకగౌడ్, గోవర్ధన్, షేక్ అహ్మద్, రెహ్మత్, పెద్దబోయిన రవి, పెద్ది నగేష్, గుర్రం మహేందర్, సత్యం, ఇందురీ సత్యం, ఉప్పుట్ల పోషం, మైనార్టీ నాయకులు మోసిన్ భాయ్, ఎండి గౌస్, జావిద్ హుస్సేన్, ముజైద్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహేందర్ రావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఈ నెల 11 నుండి

# ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు

## జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06(జనంసాక్షి ):** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ 10వ తరగతి పరీక్షలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలలో, ఇంటర్మీడియట్ పరీక్షల కొరకు జిల్లా పరిషత్ సెకండరీ బాలుర పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాలలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

## అన్ని సౌకర్యాలు కల్పిస్తేనే అనుమతి
## ఆస్పత్రులను పరిశీలించిన డి.ఎం.హెచ్. ఓ వాణిశ్రీ




**పాలకుర్తి, అక్టోబరు 06(జనంసాక్షి)** కొత్తగా ఏర్పాటు చేసే ఆస్పత్రిలో ప్రజలకు అన్నీ సౌకర్యాలు కల్పించాలని జిల్లా వైద్యాధికారి వనపర్తి వాణిశ్రీ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో కొత్తగా రిజిస్ట్రేషన్ కోసం ధరఖాస్తు చేసుకున్న ఆస్పత్రులను డీసీహెచ్ఎస్ డాక్టర్ సంధ్యతో కలిసి వాణిశ్రీ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తి నుంచి రెండు కొత్తగా ఆసుపత్రుల ఏర్పాటు చేసేందుకు రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అందులో బాగంగానే ఆస్పత్రిని సందర్శించి అస్పత్రుల్లో అధునాతన యంత్రాలు, ఫైర్ శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన అన్ని సౌకర్యాలు ఉండేలా యాజమాన్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్నీ సౌకర్యాలు ఉంటేనే అనుమతి ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. వారి వెంట తహసీల్దార్ సరస్వతీ. డాక్టర్ సిద్ధార్థ రెడ్డి. ఎంపీవో వెంకటమల్లికార్జున్. ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు క్యాష్ లెస్ వైద్యం అందించాలని వినతిపత్రం

**మొగుళ్లపల్లి (జనం సాక్షి అక్టోబర్ 06)** రాష్ట్రంలో జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ వెంటనే ప్రభుత్వ ఉద్యోగాలతో సమానంగా క్యాష్ లెస్ హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరుతున్నాము. ఈ హెచ్ ఎస్ కాకుండా ఈ జె హెచ్ ఎస్ స్కీమ్‌ను పునరుద్ధరించి మెరుగైన సేవలు అందించాలని మనవి.తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సభ్యులుగా తమరికి విన్నవిస్తూ 50 పైసల పోస్ట్ కార్డు ద్వారా టీయూడబ్ల్యూజే యూనియన్ ఆధ్వర్యంలో మొగుళ్లపల్లి జర్నలిస్టులు తమరిని కోరడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు నిమ్మల సారయ్య, కట్కూరి ఐలయ్య,రాళ్ల బండి శ్రీనివాస్, వేముల నవీన్ కుమార్ గౌడ్, మంగళపల్లి శ్రీనివాస్,చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్,క్యాతరాజు రజనీకాంత్,చెక్క శ్రీధర్, చింతకింది రమేష్, నిమ్మల భద్రయ్య, ఉప్పుల రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్ మండల నాయి బ్రాహ్మణ సంఘం ఎన్నిక



### అధ్యక్షుడిగా నడిగోటి ప్రభాకర్

**వెంకటాపూర్(రామప్ప ),అక్టోబర్ 06:-** వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో నాయి బ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడిగా నడిగోటి ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడిగా వేల్పుగొండ మధు, ముఖ్య సలహాదారులుగా మాచర్ల రాజు, మొగిలిచర్ల మొగిలి, ప్రధాన కార్యదర్శిగా మొగిలిచర్ల అనిల్, ఉపాధ్యక్షులుగా అన్నం రాజ్ కుమార్, మొగిలిచర్ల శరత్, శ్రీరాముల రాజు, ప్రచార కార్యదర్శిగా నడిగోటి శ్రీనివాస్, కార్యదర్శిగా మురహరి సంపత్, కోశాధికారిగా మాచర్ల కోటి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వేల్పుగొండ సతీష్ తదితరులు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వేల్పుగొండ సతీష్, ప్రధాన కార్యదర్శి తంగేళ్లపల్లి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మురహరి శ్రీకాంత్, కోశాధికారి నడిగోటి వేణు, కార్యదర్శి సూత్రపు కర్ణాకర్, ములుగు మండల అధ్యక్షుడు చిక్కుల శివాజీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థి మహాసభకు భారీగా తరలి వెళ్లిన విద్యార్థులు



**మహాదేవపూర్: అక్టోబర్ 6 ( జనంసాక్షి):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ గ్రౌండ్లో ఏర్పాటుచేసిన మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మహాసభకు మంగళవారం మహాదేవపూర్ ,పలిమెల మండలాల నుండి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు విద్యార్థులు బృందం బయలుదేరడం జరిగింది. మండల ఇన్చార్జి నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులను మహాజన విద్యార్థి సభకు తరలించడం జరిగింది. ఈ సభకు తరలివెళ్లిన మండల ప్రధాన కార్యదర్శి లింగాల నిఖిల్ మాదిగ ఉపాధ్యక్షులు శనిగరపు గణపతి మాదిగ లక్ష్మణ్ మాదిగ మల్లేష్ మాదిగ, శ్రీధర్ మాదిగ, సంబంధం మాదిగ విజయ్ మాదిగ బన్నీ మాదిగ తోపాటు శ్రీను మాదిగ, విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులు ఎమ్మార్పీఎస్ నాయకులు తరలి వెళ్లడం జరిగింది.

# సింగరేణి ఏరియాలో స్పెషల్ క్యాంపెయిన్ 6.0

### ఈ-వేస్ట్ డిస్పోజల్ కార్యక్రమం




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో,(జనంసాక్షి):** స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో భాగంగా భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఈ-వేస్ట్ డిస్పోజల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్టోబర్ 2 నుండి 31 వరకు చేపడుతున్న ఈ ప్రత్యేక క్యాంపెయిన్ లో భాగంగా ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, పాడైన, పనికిరాని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాలలో వేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పాత ఎలక్ట్రానిక్ పరికరాలను కార్యాలయాల్లో పేరుకుపోకుండా సేకరించి పర్యావరణానికి హాని కలగకుండా సరైన పద్ధతిలో డిస్పోజల్ చేయడం ముఖ్యమన్నారు. కేవలం కొత్త అప్ డేట్లు, కొత్త మోడళ్లు వచ్చాయని మొబైల్ ఫోన్లను అనవసరంగా మార్చకుండా, ఉన్న ఫోన్‌ను సాధ్యమైనంత వరకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ-వేస్ట్ ను తగ్గించడం ద్వారా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రామన్ వి పాఠక్, ఏజీఎం (సివిల్) రవికుమార్, ఏజీఎం (ఈఎం) శంభశివరావు, డీజీఎం (ఫైనాన్స్) రాజేశ్వర్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యామ్ సుందర్, సర్వే ఆఫీసర్ శైలేంద్ర కుమార్, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్ శంకర్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల శిక్షణను
# పరిశీలించిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో




**ఏటూరునాగారం,అక్టోబర్ 06(జనంసాక్షి).** గిరిజన యువతకు పోలీస్ ఉద్యోగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఏటూరునాగారంలోని గిరిజన భవనంలో నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, ఏ ఎస్పీ మన్నన్ కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న గిరిజన అభ్యర్థులతో పీఓ మాట్లాడి, శిక్షణలో వారికి అందుతున్న సౌకర్యాలు, వసతి, భోజనం, విద్యా శిక్షణ, రోజువారీ కార్యక్రమాలు, శారీరక దారుఢ్య శిక్షణ తదితర అంశాలను పరిశీలించారు. అభ్యర్థుల నుంచి వారి అవసరాలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ శిక్షణకు వాజేడు, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు చెందిన అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో శారీరక సామర్థ్యం ఎంతో కీలకమని, అభ్యర్థులు క్రమశిక్షణతో శిక్షణను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని పీఓ సూచించారు. శిక్షణ కేంద్రంలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన పనులను పర్యవేక్షించాలని స్థానిక వీణాను పీఓ ఆదేశించారు. అభ్యర్థులకు మెరుగైన వాతావరణం కల్పించేలా పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే అభ్యర్థుల శారీరక దారుఢ్య శిక్షణ, ఫిజికల్ యాక్టివిటీస్ కోసం కొమరం బీమ్ స్టేడియాన్ని వినియోగించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభ్యర్థులకు శిక్షణతో పాటు వసతి, భోజనం, పరిశుభ్రత, శారీరక దారుఢ్యానికి అవసరమైన సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పీఓ అధికారులను ఆదేశించారు. గిరిజన యువత పోలీస్ ఉద్యోగాల్లో ఎక్కువ సంఖ్యలో ఎంపికయ్యేలా శిక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

## గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి :జిల్లా కలెక్టర్ కె. హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06(జనంసాక్షి ):** అంగన్వాడీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన చిన్నారులు, వారి తల్లులకు అన్ని విధాలుగా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం అసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తేలిగూడ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్న సమయంలో స్లాబ్ పెచ్చులు ఊడిపడిన ఘటనలో ఇద్దరు చిన్నారులతో పాటు వారి తల్లులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న చిన్నారులు, వారి తల్లులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గాయాల తీవ్రత, ప్రస్తుతం అందిస్తున్న చికిత్స, వైద్య పరీక్షలు, మందుల అందుబాటు తదితర అంశాలపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు, వారి తల్లులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన చిన్నారులు, వారి తల్లులు ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, పిల్లలు, తల్లులు క్షేమంగా ఉన్నారని, ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చికిత్స అందిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భవనాల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన మరమ్మతులు, భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్నారులు చదువుకునే, భోజనం చేసే, విశ్రాంతి తీసుకునే ప్రాంతాలలో ఎటువంటి ప్రమాదకర పరిస్థితులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సంబంధిత అధికారులు వివరాలు సేకరించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. చికిత్స విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, చిన్నారులకు అవసరమైన మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు కిరణ్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి సేవించిన ఐదుగురికి డీ-అడిక్షన్ చికిత్స- ఎస్సై పోచంపల్లి సతీష్




**చిట్యాల, అక్టోబర్ 06( జనం సాక్షి):**గంజాయి సేవిస్తూ పట్టుబడిన ఐదుగురు యువకులను కోర్టు ఆదేశాల మేరకు చికిత్స, కౌన్సెలింగ్ నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని డీ–అడిక్షన్ వార్డుకు తరలించినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. జూకల్ శివారు కెనాల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో గంజాయి సేవిస్తుండగా చల్లగరిగ, ముచినిపర్తి గ్రామాలకు చెందిన మ్యాదరి ప్రశాంత్ (24), దూడపక ప్రకాష్ (21), బైస బన్నీ (23), కుంచం బన్నీ (22), పసరగొండ సంజయ్ రాజ్ (19) అనే ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో వారు గంజాయి సేవించినట్లు తేలడంతో చిట్యాల పోలీస్ స్టేషన్లో ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 27(ఎ) కింద కేసు నమోదు చేశారు.అనంతరం నిందితులను భూపాలపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, వారి భవిష్యత్తు, మానసిక పరివర్తనను దృష్టిలో ఉంచుకుని గౌరవ న్యాయమూర్తి వారిని డీ–అడిక్షన్ సెంటర్కు తరలించాలని ఆదేశించారు. ఆ మేరకు పోలీసుల ఆధ్వర్యంలో వారిని వరంగల్ ఎంజీఎం డీ–అడిక్షన్ వార్డుకు చేర్చి, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మండల పరిధిలో ఎవరైనా గంజాయి సరఫరా చేసినా, విక్రయించినా లేదా సేవించినా వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో పరకాల టాప్

## బీఎల్ఓలకు ఘన సన్మానం



**ఆత్మకూరు అక్టోబర్ 06, ( జనం సాక్షి ):** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో పరకాల నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యంలో, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విశేష కృషి చేసిన ఆత్మకూరు మండల బీఎల్ఓలను పరకాల ఆర్డీవో డిఎస్ వెంకన్న ఘనంగా సన్మానించారు. మంగళవారం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన ఆత్మకూరు మండలంలోని బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. అనంతరం బిఎల్ఓలు ఆర్డీవో ను శాలువాతో సన్మానించారు. ఓటర్ల వివరాల సేకరణ, ధ్రువీకరణ, డిజిటలైజేషన్ తదితర ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించిన బూత్ లెవల్ అధికారుల సేవలను అధికారులు అభినందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఇతర ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో పరకాల నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని ఆర్డీవో వెంకన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీఎల్ఓలను శాలువాలతో సత్కరించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఓటర్ల జాబితా సవరణను బాధ్యతగా నిర్వహించిన బీఎల్ఓలను అధికారులు అభినందించారు. ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతముగా పూర్తి చేసి పరకాల నియోజక వర్గానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆర్డిఓ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్ .జగన్ మోహన్ రెడ్డి, ఎంపిడీవో ఎం. శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మంజుల, డీ. మమత, సూపర్వైజర్లు ఆర్ఐ ఫారూక్, ఆర్ఐ హారిక, , కంప్యూటర్ ఆపరేటర్లు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

# శివనగర్ పై ఇంత నిర్లక్ష్యమా.!

- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- రోడ్డుపై అలుకు నీళ్లు చల్లి వినూత్న నిరసన



**ఖిలా వరంగల్ మండలం, అక్టోబర్ 06 (జనం సాక్షి)** మాపై ఇంత నిర్లక్ష్యమా.. ఆరేళ్లు అయినా మా గోస పట్టదా.. ఇంకెన్నాళ్లు సహించాలి.. అసలు వరంగల్ లో ప్రభుత్వ పాలన ఉందా అంటూ బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శివనగర్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల్లో ప్రభుత్వాల నిర్లక్ష్యం, అధికారుల జాప్యానికి నిరసనగా మంగళవారం శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో శివనగర్లో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు.డ్రైనేజ్ గుంతలతో అధ్వాన్నంగా మారిన రోడ్డుపై అలుకు నీళ్లు జల్లుతూ, ప్రభుత్వాల మొద్దు నిద్రను నిరసిస్తూ బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఆందోళనలో పాల్గొన్న గంట రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు.. మంత్రులకు మా గోస పట్టదా.. శివనగర్ అంటే ఎందుకు ఇంత వివక్ష..మీకు ఓట్లు.. మాకు పాట్లా.. మేము ముంపులోనే ఉండాలా.. వానొస్తే నీటిలో మునగాలా.. ఖబడ్దార్ పాలకులరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.గత ఎమ్మెల్యే.. ప్రస్తుత ఎమ్మెల్యే ఇద్దరు.. ఇద్దరే అంటూ ధ్వజమెత్తారు. వారికి ఓట్లు తప్ప మన గోస పట్టదని మండి పడ్డారు. మన సమస్యలపై మనమే యుద్ధం చేయాలని.. ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం ముమ్మరం చేస్తుందని... గంట రవికుమార్ స్పష్టం చేశారు.నాలుగు నెలల క్రిందట మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అధికారులతో కలిసి ఇదే రోడ్డుపై స్వయంగా సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారనీ, పది రోజుల్లోనే పనులన్నీ పూర్తి చేసి, ఈ రోడ్డును ప్రజల వాడకానికి ప్రారంభిస్తామని చెప్పి ఏళ్ళు గడుస్తున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అయినా వారి పార్టీలో.. వారి పదవులకే దిక్కు లేదని.. ఇక మన సమస్యలల్ని ఎక్కడ పట్టించుకుంటారని ఎద్దేవా చేశారు.పనుల్లో సర్కారు కక్షపూరిత వైఖరితో శివనగర్ ప్రజలకు శాపంగా మారిందని గంట ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శిలు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్, మరియు బిజెపి జిల్లా నాయకులు ఆడెపు వెంకటేష్, బైరి శ్యాంసుందర్, మార్తా ఉషారాణి, తాళ్లపల్లి శ్రీనివాస్, బండి సుజాత, శెట్టి స్రవంతి, పిట్టల వెంకన్న, జన్ను ప్రభాకర్, నవీన్, దేవక్క, డివిజన్ కన్వీనర్లు సతీష్, బొడకుంట్ల శివశంకర్, తోట సాగరిక, శెట్టి రమేష్, సూరజ్, బిజెపి జిల్లా పదాధికారులు బన్న ప్రభాకర్, గడల కుమార్, బైరి నాగరాజు, అంకాల జనార్ధన్, వివిధ జిల్లా మోర్చా అధ్యక్షులు మాదాసు రాజు, కూచన క్రాంతి కుమార్ , కర్నె రవీందర్, షేర్ల అనిల్, మోహనాచారి, వీరస్వామి, సాయి, చంద్రమోహన్, సతీష్ కట్టర్, కందుకూరి శ్రీనివాస్, జెట్లింగ్ శివప్రసాద్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ

- నివాళులర్పించిన చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్
- రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందించిన సర్పంచ్ బానోతు విక్రమ్



**చెన్నారావుపేట, అక్టోబర్ 6 ( జనం సాక్షి):** మృతురాలి కుటుంబాన్ని చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ మంగళవారం పరామర్శించారు. మండలంలోని పదహారు చింతల తండ గ్రామానికి చెందిన బోడ ఈరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన మృతురాలి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ బానోతు విక్రమ్ రూ.5 వేల ఆర్థిక సహాయంను అందజేశారు. వారి వెంట చెరువుకొమ్ము తండ ఉపసర్పంచ్ మోహన్, వార్డు సభ్యులు కేశ్య నాయక్, జెత్య, గణేష్, శంకర్, రాంజీ, రాజు, శ్రీను, బోజ్యా, పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దొంతిని కలిసిన కాంగ్రెస్ మండల కార్యదర్శి భూక్య మోహన్ నాయక్



**చెన్నారావుపేట, అక్టోబర్ 6( జనం సాక్షి):** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని చెన్నారావుపేట కాంగ్రెస్ మండల కార్యదర్శి భూక్య మోహన్ నాయక్ మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బోడ మాణిక్యం తండాలో ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి వినతి పత్రం అందించారు.గ్రామంలో వాటర్ ప్లాంట్, సీసీ రోడ్లు, మౌలిక వసతులు పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే గ్రామంలో ఉండబడిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# పట్టభద్రుల సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి

## పల్లా సుందర్ రాంరెడ్డి

**దేవరుప్పుల, అక్టోబర్ 06 (జనం సాక్షి):** జనగామ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నేడు ఉదయం 10 గంటలకు నిర్వహించే పట్టభద్రుల సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి కోరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ సమావేశానికి పట్టభద్రులు, యువజన, సోషల్ మీడియా నాయకులు, పార్టీ కార్యకర్తలు సమయానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి అల్లకొండ కుమార్




**చిట్యాల, అక్టోబర్ 06( జనం సాక్షి):** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఈ నెల 9న పుష్ప గార్డెన్స్లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లకొండ కుమార్ పిలుపునిచ్చారు. సుమారు 300 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత సాధించిన వారికి అక్కడికక్కడే ఉద్యోగ ఎంపికతో పాటు జాయినింగ్ లెటర్లు అందించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎలగొండ చిరంజీవి, బొమ్మ కిరణ్, తీగల నాగరాజు, కంచు శ్రీకాంత్, గోల్కొండ నాగరాజు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ స్పీకర్



చిట్యాల, **అక్టోబర్ 06( జనం సాక్షి):** మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ స్పీకర్ శాసనమండలి ప్రతిపక్ష నేత శ్రీ సిరికొండ మధుసూదనా చారి పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కంచర్ల మధు నాగరాజు నానమ్మ కంచర్ల సమ్మక్క ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చల్లగరిగ గ్రామం లో పార్టీ కార్యకర్త బోయిని సుమన్ తల్లి సారక్క మృతిచెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు తనకు ఏమాత్రం అవకాశం ఉన్న మృతుల కుటుంబాలకు అన్ని విధాల సహకరిస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చింతల రమేష్ ముదిరాజ్ ఇజ్గిగిరి ఆనందం ఎండి శంషోద్దీన్ , ఉప్పుల కిరణ్ బొంకూరి సమ్మయ్య ఇంజపల్లి చంద్రమౌళి పెండ్లి ఆదిరెడ్డి నల్ల నవీన్ గోపగాని నరేష్ దాసరపు సురేష్ కొడపాక రమేష్ నోముల రంజిత్ కట్ల రమేష్ రఘుపతి జన్నె రమేష్ కొర్రి సతీష్ గద్దల రాజు నగరం రాజు కంచర్ల లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## ఏయుపీఎస్ బయ్యక్కపేట పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



**ఏటూరునాగారం,అక్టోబర్ 06(జనంసాక్షి).** బయ్యక్కపేటలోని గిరిజన సంక్షేమ ప్రాథమికోన్నత పాఠశాల (ఏయుపీఎస్)ను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి పాఠశాలలోని విద్యా పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల నోట్‌బుక్స్, అభ్యసన స్థాయి, విద్యా ప్రగతిని పరిశీలించి, పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, డార్మిటరీ తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పాఠశాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు తరగతి బోధన, విద్యార్థుల అభ్యసన ప్రగతి, హాజరు మరియు పాఠశాల నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలని పీఓ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

## 44వ సర్వే పత్రాలతో 43లో పాగా వేస్తారా?

### అక్రమ నిర్మాణాలు,బెదిరింపులపై మాచర్ల కుమార్ ఆగ్రహం

**నస్పూర్ (జనంసాక్షి):** 44వ సర్వే నంబర్‌కు సంబంధించిన పత్రాలను అడ్డుపెట్టుకుని 43వ సర్వే నంబర్‌లోని తన భూమిపై హక్కులు ఉన్నట్లు చెప్పి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మాచర్ల కుమార్ ఆరోపించారు.తన భూమి కబ్జాకు పాల్పడి నిర్మాణం చెప్పెట్టేందుకు ప్రయత్నిస్తే అధికారులు నిర్మాణం అక్రమమని తేల్చి తొలగించారని,తన భూమి విషయంలో బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.మంగళవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కుమార్ మాట్లాడుతూ ఇరుకుల్ల పురుషోత్తం,నల్ల సంజీవరెడ్డి,కన్నం వెంకటేశ్వరరావు ఈ వ్యవహారంలో ఉన్నారని ఆరోపించారు.44వ సర్వే నంబర్ పత్రాలను చూపిస్తూ 43వ సర్వే నంబర్‌లోని భూమిపై హక్కులు ఎలా కోరుతారని ప్రశ్నించారు.తన భూమిలో నిర్మాణ పనులను అడ్డుకునేందుకు ధనబలం,అధికార బలంతో బెదిరిస్తున్నారని కుమార్ ఆరోపించారు.భూ పత్రాలను రెవెన్యూ,పోలీసు అధికారులు మరోసారి పూర్తిస్థాయిలో పరిశీలించి వాస్తవాలను తేల్చాలని కోరారు.అక్రమ నిర్మాణాలు,బెదిరింపులకు తక్షణమే అడ్డుకట్ట వేసి తన భూమికి రక్షణ కల్పించాలని అధికారులను డిమాండ్ చేశారు.అదే విధంగా రంగ రాహుల్ మాట్లాడుతూ తన భూమిని కూడా కబ్జా చేస్తున్నారని తనకు కూడా న్యాయం చేయాలని కోరాడు.

## పంటకోత ప్రయోగాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 6 (జనం సాక్షి)** :పంటల దిగుబడి అంచనా కోసం నిర్వహించే పంటకోత ప్రయోగాలను నిర్దేశిత శాస్త్రీయ పద్ధతిలో, కచ్చితత్వంతో నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక, వ్యవసాయ శాఖల క్షేత్రస్థాయి అధికారులకు పంటకోత ప్రయోగాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల ద్వారా సేకరించే దిగుబడి వివరాలు ప్రభుత్వం తీసుకునే అనేక కీలక విధానపరమైన నిర్ణయాలకు ఆధారంగా ఉంటాయని తెలిపారు. కనీస మద్దతు ధర నిర్ణయం, ధాన్యం సేకరణ, ఆహార భద్రత, పంటల బీమా, ఎగుమతి–-దిగుమతి విధానం, ద్రవ్యోల్బణ నియంత్రణ తదితర అంశాల్లో ఈ వివరాలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పంటకోత ప్రయోగాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో ప్రతి ప్రయోగాన్ని నిర్దేశిత నిబంధనలు, శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. సేకరించే దిగుబడి వివరాలు కచ్చితంగా, నాణ్యంగా ఉండేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 100 వరి, 20 మొక్కజొన్న, 60 పత్తి, 10 ఎండు మిరప పంటకోత ప్రయోగాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.జిల్లా వ్యవసాయ అధికారి వి. విజయ్ చంద్ర మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో నిర్వహించే పంటకోత ప్రయోగాలను పర్యవేక్షకులు తప్పనిసరిగా పర్యవేక్షించి, నాణ్యమైన, విశ్వసనీయమైన దిగుబడి వివరాలను సేకరించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో హన్మకొండ, పరకాల డివిజన్ల వ్యవసాయ సహాయ సంచాలకులు, ప్రణాళిక శాఖ గణాంక అధికారి, మండల వ్యవసాయ అధికారులు, ఉప గణాంక అధికారులు, మండల ప్రణాళిక గణాంక అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయిలో పోటీల్లో క్రీడాకారులు

## జాతీయ స్థాయి ప్రతిభ కనబరిచేందుకు విద్యార్థులకు శిక్షణ

### శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్



**మహాదేవపూర్: అక్టోబర్ 6 (జనంసాక్షి):** మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పూర్ణిమ ఆధ్వర్యంలో పెద్దపల్లి మరియు భూపాలపల్లి జిల్లాలోని రాష్ట్రస్థాయి పోటీలు పాల్గొన్న కబడ్డీ క్రీడాకారులకు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుచుటకు పది రోజులపాటు ఉచిత ట్రైనింగ్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో ప్రారంభించడం జరిగింది. కబడి క్రీడాకారులకు క్రీడలో మరింత నైపుణ్యాన్ని అందించుటకు నిర్వహించబడిన ఉచిత ట్రైనింగ్ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల కేంద్రంలో రాష్ట్ర స్థాయి విద్యార్థులకు జాతీయస్థాయి పోటీలు పాల్గొని ప్రతిభను కనబరిచేలా వారికి తీర్చిదిద్దడం ఎంతో గొప్ప విషయమని, ప్రభుత్వ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పూర్ణిమ విద్యార్థుల క్రీడల నైపుణ్య విషయంలో శ్రద్ధ వహిస్తూ ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రారంభించడం మండలానికి ఎంతో గర్వం కారణమని అన్నారు చైర్మన్ కోట రాజబాబు, ఈ యొక్క శిక్షణలో పాల్గొన్న రెండు జిల్లాల విద్యార్థులు జాతీయస్థాయిలో పాల్గొని రాష్ట్ర పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. అలాగే పిడి పూర్ణిమ మహాదేవపూర్ పేరును క్రీడల్లో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలతో పాటు రాష్ట్రస్థాయిలో మండల పేరును నిలబెట్టడం జరిగిందని అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్, పిఎసిఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, స్థానిక క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

## ఉప్పరపల్లి గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలి

### నర్సంపేట ఎమ్మెల్యే దొంతి, డిపో మేనేజర్‌కు వినతి



**చెన్నారావుపేట, అక్టోబర్ 6 ( జనం సాక్షి):** ఉప్పరపల్లి గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలని ఉప్పరపల్లి గ్రామస్తులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, డిపో మేనేజర్ ను కోరారు. మంగళవారం ఈ మేరకు వారికి వేరువేరుగా వినతి పత్రాలను అందించారు. ఉప్పరపల్లి గ్రామం నుండి విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్తులు ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం నర్సంపేట, వరంగల్ పట్టణాలకు నిత్యం ప్రయాణిస్తుంటారన్నారు. సమయానుకూలంగా బస్సు సర్వీసులు నడవకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.మొదటి సర్వీసు ఉదయం ఉదయం 06:30 గంటలకు నర్సంపేట నుండి బయలుదేరి 07:00 గంటలకు ఉప్పరపల్లి మీదుగా 08:00 గంటలకు వరంగల్ చేరాలని తిరిగి ఉదయం 08:00 గంటలకు వరంగల్ నుండి బయలుదేరి.. 09:00 గంటలకు ఉప్పరపల్లి మీదుగా 09:30 నర్సంపేటకు చేరాలన్నారు. రెండవ సర్వీసు ఉదయం 09:30 గంటలకు నర్సంపేట నుండి బయలుదేరి 10:00 గంటలకు ఉప్పరపల్లి మీదుగా 11:00 గంటలకు వరంగల్ చేరాలని తిరిగి మధ్యాహ్నం 11:00 గంటలకు వరంగల్ నుండి బయలుదేరి 12:00 గంటలకు ఉప్పరపల్లి మీదుగా 12:30 నర్సంపేటకు చేరాలని మూడవ సర్వీసు సాయంత్రం 05:00 గంటలకు నర్సంపేట నుండి బయలుదేరి 05:30గంటలకు ఉప్పరపల్లి మీదుగా 06:30 గంటలకు వరంగల్ చేరాలని తిరిగి రాత్రి 07:00 గంటలకు వరంగల్ నుండి బయలుదేరి 08:00 గంటలకు ఉప్పరపల్లి మీదుగా 08:30 నర్సంపేటకు చేరే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల మల్లారెడ్డి, సుధన్ రెడ్డి, పొలాటి గణపతి రెడ్డి, కోత్వాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీల సమస్యపై ఎమ్మెల్సీ ట్రైబల్ కమిషనర్‌కు వినతి



**నేరడిగొండ అక్టోబర్6(జనంసాక్షి):** ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ)ల ప్రధాన సమస్య అయిన మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ట్రైబల్ కమిషనర్ సంతోష్,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాల్ రెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ట్రైబల్ కమిషనర్ సంతోష్ సీఆర్టీ ఉపాధ్యాయుల సమస్యపై సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు సహకరిస్తామని తెలిపారు.అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాల్ రెడ్డి స్పందిస్తూ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు తప్పకుండా మినిమం టైం స్కేల్ అందేలా కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని,ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకునే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్ ఉట్నూర్ మండల అధ్యక్షులు అజయ్ పవార్ నేరడిగొండ మండల ప్రధాన కార్యదర్శి జాధవ్ తానాజీ తెలంగాణ కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షులు జాధవ్ వినంత్ రావు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాథోడ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దసరా నాటికి డబుల్ బెడ్ రూమ్స్ ఇండ్ల అప్పగింతకు చర్యలు

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి , అక్టోబర్ 6, జనంసాక్షి** జిల్లాలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలను ఈ దసరా నాటికి లబ్దిదారులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటీల పరిధిలోని రెండు పడక గదుల ఇండ్ల గృహ సముదాయాలను గృహ నిర్మాణ శాఖ పి.డి., డి.ఈ., ఎ.ఈ. లతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి గృహ సముదాయాలలో పెండింగ్ పనులు, త్రాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... దసరా నాటికి రెండు పడక గదుల ఇండ్లను లబ్దిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి, లబ్దిదారులకు గృహాల అప్పగింతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు దసరా నాటికి గృహ సముదాయాలను లబ్దిదారులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, తహసిల్దార్, క్యాతన్‌పల్లిలో మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, మందమర్రిలో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మిషన్ ఫర్ ఆత్మనిర్భరత పథకంపై అవగాహన

### అప్పు దినుసుల సాగుతో అధిక దిగుబడులు సాధించాలి.. మండల వ్యవసాయ అధికారి





**గుడిహత్నూర్, అక్టోబర్ 6 ( జనం సాక్షి):** గుడిహత్నూర్ మండలంలోని దామన్‌గూడ గ్రామంలో మంగళవారం మిషన్ ఫర్ ఆత్మనిర్భరత పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్ కుమార్ మాట్లాడుతూ పథకంలో భాగంగా అప్పు దినుసుల పంటల సాగు, అధిక దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు వివరించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని, పంటల సాగులో శాస్త్రీయ విధానాలను అవలంబించాలని సూచించారు. పంటల దిగుబడిని పెంచడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఖర్జిభింపూర్‌లో వైద్య శిబిరం



**భీమిని అక్టోబర్ 6 జనం సాక్షి** భీమిని మండలంలోని.ఖర్జిభింపూర్ గ్రామం లో మంగళవారం మెడికల్ ఆఫీసర్ జతీ. నిర్మల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో 70మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా రక్త పూత 6 వ్యక్తులకు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని మరియు గర్భవతులను పరీక్షించి మందులు ఇవ్వడం తో పాటు సూచనలు ఇవ్వడం జరిగిందని వైద్యురాలు నిర్మల తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని దోమతెరలు వినియోగించుకోవడం వల్ల దోమల నుండి రక్షణ పొందవచ్చని తప్పకుండా వీటిని అందరూ వినియోగించాలని. ఇండ్లలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని. తలనొప్పి ఒళ్ళు నొప్పులు అనిపించినప్పుడు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించుకొని తగు మందులు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. వచ్చే సీజన్ చలికాలం లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూడా వైద్యురాలు వివరించారు .పరీక్షలు నిర్వహించిన వారికి తగు మందులను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఠాకూర్ చంద్రకళ తరుణ్ సింగ్ పంచాయతీ కార్యదర్శి సంతోష్ అంగన్వాడీ టీచర్ వైద్య సిబ్బంది మీనా రజిత తదితరులు పాల్గొన్నారు.

## అడవి ప్రాంతంలో మెరుపు సోదాలు



**చిట్యాల, అక్టోబర్ 06( జనం సాక్షి):** అటవీ భూములను ఆక్రమించినా, వన్యప్రాణులకు హాని తలపెట్టినా, అడవిలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా సహించేది లేదని చెల్పూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రమౌళి హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై అటవీ రక్షణ చట్టాల ప్రకారం కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణలో భాగంగా మంగళవారం వెలిశాల సెక్షన్ పరిధిలోని అందుగుతండ బీట్‌లో అటవీ అధికారులు విస్తృత తనిఖీలు, మెరుపు సోదాలు నిర్వహించారు.ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో రేంజ్ సిబ్బంది సరిహద్దు, అంతర్భాగ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అందుగుతండ బీట్ పరిధిలోని పలు అనుమానిత ఇళ్లలో అటవీ అధికారులు మెరుపు సోదాలు నిర్వహించారు. అనంతరం అటవీ ప్రాంతంలో సుమారు 8 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి వన్యప్రాణుల రక్షణ కోసం 'క్యాచ్ ది స్నేర్స్, క్యాచ్ ది ట్రాప్స్' కార్యక్రమాన్ని చేపట్టారు. అడవిలో క్రూరమృగాల వేట కోసం ఆకతాయిలు అమర్చిన విద్యుత్, ఇనుప తీగలు, ఉచ్చులను గుర్తించి అక్కడికక్కడే తొలగించారు.దట్టమైన అటవీ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా తయారీ స్థావరాన్ని అధికారులు గుర్తించారు. అక్కడ నాటుసారా కాపుతో పాటు తయారీ పరికరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. అనంతరం పాత అటవీ ఆక్రమణ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు స్థానిక గ్రామస్తులతో సమావేశమయ్యారు. అటవీ చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చంద్రమౌళి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రత్నజ్యోతి, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సాపూర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్ఈ బి.బిక్షపతి

### విద్యుత్ సరఫరా పరిస్థితిపై అధికారులతో సమీక్ష



**వెంకటాపూర్(రామప్ప),అక్టోబర్6 (జనం సాక్షి):-** విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వినియోగదారులకు నాణ్యమైన,విశ్వసనీయ విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలని ఎస్ఈ ఆపరేషన్ బి.బిక్షపతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ములుగు డివిజన్ పరిధిలోని వెంకటాపూర్ సెక్షన్‌లో ఉన్న నర్సాపూర్ సబ్‌స్టేషన్‌ను డీఈ కన్న రాజు టెక్నాలజీ/ ఆపరేషన్ ములుగు తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ సరఫరా పరిస్థితి, పరికరాల పనితీరు, లోడ్ స్థితిగతులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, ఏవైనా లోపాలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు.విద్యుత్ అంతరాయాలు, లో-వోల్టేజ్ లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని ఎస్ఈ సూచించారు. విఫలమైన ట్రాన్స్‌ఫార్మర్లను ఆలస్యం లేకుండా మార్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని తెలిపారు. విద్యుత్ మౌలిక వసతుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, వినియోగదారులు, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

### ఎఈ పి.రమేష్

**వెంకటాపూర్(రామప్ప)అక్టోబర్6(జనం సాక్షి):-** వెంకటాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామ(వెంకటాపూర్,ఎల్లారెడ్డిపల్లి, నల్లగుంట, జవహర్ నగర్ మరియు లింగాపూర్)రైతులకు మరియు విద్యుత్ వినియోగదారులు ఎఈ పి.రమేష్ తెలియజేస్తూ ఏలినినో ప్రభావం వలన పెరుగుతున్న విద్యుత్ లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని,వెంకటాపూర్ సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 3.15 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌గా సామర్థ్యం పెంచే పనులు చేపట్టబడుతున్నాము.ఈ పనుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు 07 అక్టోబర్ 2026 రోజున సుమారు 3 గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.కావున, ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు మరియు ప్రజలు విషయాన్ని గమనించి, విద్యుత్ శాఖకు సహకరించగలరనీ వెంకటాపూర్ ఆపరేషన్ ఏఈ పి.రమేష్ తెలిపారు.

# అయ్యా బాబోయ్.. ఇవేం కుక్కలు..!

వీధుల్లో ఇలాంటి కుక్కలు గుంపులుగా తిరుగుతుండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే జంకుతున్న పరిస్థితి నెలకొంది.. ఇప్పటికే వీధి శునకాల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, ఇప్పుడు అనారోగ్యంతో ఉన్న కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో సమస్య మరింత తీవ్రంగా మారింది.. వాటిని గుర్తించి చికిత్స అందించడం, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం, వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన సంబంధిత శాఖలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అనారోగ్యంతో ఉన్న వీధి శునకాలు కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. సమస్య తీవ్రత అధికారుల దృష్టికి వెళ్లినా ఇప్పటివరకు సమగ్ర చర్యలు కనిపించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. వ్యాధిగ్రస్త శునకాలను గుర్తించి వాటికి చికిత్స అందించడంతో పాటు, వాటి వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**ప్రజలకు ముప్పు పొంచి ఉందా?**

అనారోగ్యంతో ఉన్న శునకాలు జనావాసాల మధ్య తిరుగుతుండటంతో వాటి ద్వారా ఏమైనా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందా అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, రోడ్లపై నడిచే వారు, ద్విచక్రవాహనదారులు వీధి కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యంతో ఉన్న శునకాలు ఒక్కసారిగా దాడికి పాల్పడితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**ఫొటోలు, వీడియోలు వైరల్.. అయినా స్పందన ఏది?**

వింత ఆకృతుల్లో కనిపిస్తున్న వీధి శునకాల దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రజలు వాటిని గమనించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని వాపోతున్నారు. సోషల్‌మీడియాలోనూ ఇలాంటి శునకాల దృశ్యాలు చక్కర్లు కొడుతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీధి శునకాలకు చిన్నపాటి వ్యాధి ఉన్నప్పుడే గుర్తించి చికిత్స అందిస్తే పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం ఉంటుంది. కానీ వ్యాధి ముదిరిన తర్వాత వాటిని పట్టించుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సమస్య తీవ్రమయ్యే వరకు ఎందుకు వేచి చూస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పశుసంవర్ధక శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అనారోగ్యంతో ఉన్న శునకాలను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన చికిత్స అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి..**

భూపాలపల్లి జిల్లాలోని అన్ని గ్రామాలు, కాలనీలు, ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో ప్రత్యేకంగా సర్వే నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అనారోగ్యంతో ఉన్న వీధి శునకాలను గుర్తించి వాటికి చికిత్స అందించడం, అవసరమైన చోట్ల ఐసోలేషన్ లేదా ఇతర వైద్య చర్యలు చేపట్టడం, వీధి శునకాల నియంత్రణకు స్థానిక అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పరిస్థితి చేయి దాటే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా పశుసంవర్ధక శాఖ, సంబంధిత అధికారులు స్పందించి జిల్లాలో ప్రత్యేక వైద్య బృందాలతో పరిశీలన చేపట్టి అనారోగ్యంతో ఉన్న వీధి శునకాలకు చికిత్స అందించడంతో పాటు ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగే వరకు వేచి చూసి.. ఆ తర్వాత స్పందించడం కాకుండా, ముందే మేల్కొని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఈజీఎంఎం ద్వారా ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సర్వే

**కెరమెరి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సుగల నిరుద్యోగ యువత వివరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. 12,760 గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శుల ద్వారా నిరుద్యోగుల సమగ్ర సమాచారం తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని సూచించింది. రెండురోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్దేశించింది. నిరుద్యోగి పేరు సహా వారికి సంబంధించిన వ్యక్తిగత, విద్యార్హత వివరాలను తెలంగాణ ఇ-పంచాయత్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులు ధ్రువీకరించి సమర్పించాలని నిర్దేశించింది.

**రాష్టంలో ఈ తరహా సర్వే తొలిసారి**

నిరుద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సమాచారం తీసుకోవడం ఇదే తొలిసారి. ఈ వివరాల ఆధారంగా వారికి ఉపాధి కల్పన, మార్కెటింగ్ పథకం(ఈజీఎంఎం), ఇతర పథకాల కింద శిక్షణ ఇచ్చి ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించాలని భావిస్తోంది. ఇటీవల ఈజీఎంఎం కొత్త కార్యనిర్వహణాధికారి(సీఈవో) రవీందర్ సమావేశం నిర్వహించగా..పలు కార్పొరేట్ సంస్థలు గ్రామీణ యువతకు కొలువులు ఇస్తామని ప్రతిపాదించినట్లు తెలిసింది. దీనికి అనుగుణంగా యువత వివరాలు సేకరించి, వాటి ప్రాతిపదికన కార్యాచరణ చేపట్టాలని భావిస్తోంది. యువత సన్నద్ధత ఆధారంగా వివిధ రకాల వృత్తి నైపుణ్యాలు(శిక్షణ) కల్పించి, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించాలని యోచిస్తోంది.

## మృతుల కుటుంబాలకు సిరికొండ పరామర్శ



**టేకుమట్ల అక్టోబర్ 06 (జనంసాక్షి) :** టేకుమట్ల మండలంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి గర్మిళ్లపెల్లి గ్రామం పెండెం రాజు (కెసిఆర్ )అమ్మ మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి వారి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు అనంతరం శివనాథం కుమార్ స్వామి కాలుకు దెబ్బ తగలగా వారి ఆరోగ్య గురించి తెలుసుకొని ధైర్యం చెప్పారు. టేకుమట్ల గ్రామం లో నూతన వధూవరులను ఆశీర్వదించారు. టేకుమట్ల మండలం కేంద్రం లో ఇటీవల అనారోగ్యంతో కొలుగురి సునీల్ వాళ్ళ తల్లి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులు ఎవరు ఎలాంటి బాధ పడవద్దు అని మృతుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల సర్పంచ్ మాట్ల శ్రీనివాస్' దొడ్ల కోటి 'రమేష్ 'బోయిని రజినికుమార్ ' బిఆర్ఎస్ నాయకులు సిరికొండ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 06 ( జనం సాక్షి) :** చిల్పూర్ మండలం కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామ దేవస్థాములో మంగ ళవారం పురస్కరించుకొని ఈవో బి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో స్వామివారికి అష్టదళ పాద పద్మా రాధన పూజ బంగారు పద్మాలతో అంగరంగ వైభవంగా అర్చకులు నిర్వహించడం జరిగింది. దేవాలయ చైర్మన పొట్లపల్లి శ్రీధర్ రావు,కిరణ్మయి దంపతులు 516 రూపాయలు చెల్లించి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.వివిధ గ్రామాలనుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. ఈ కార్యక్రమం కార్యనిర్వాహణాధికారి బి లక్ష్మీ ప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ సిహెచ్ రాజేందర్ రెడ్డి ,ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రధాన అర్చ కుడు బి రవీందర్ శర్మ,అర్చకులు సౌమిత్రి రంగా చార్యులు, కృష్ణమాచార్యులు, చెరువు ఆదిత్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంజీఎంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆకస్మిక తనిఖీ

- **ల్యాబ్‌లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి..**
- **సాంకేతికతతో రోగులకు త్వరిత సేవలు అందించాలి**
- **ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైతే షోకాజ్..!**



**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 6 (జనంసాక్షి):** ఎంజీఎం ఆసుపత్రిలో విధులకు ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరయ్యే అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం ఆమె ఎంజీఎం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అడ్మినిస్ట్రేషన్ విభాగాలు, రికార్డు రూమ్, ల్యాబ్‌తోపాటు వివిధ విభాగాలను పరిశీలించారు.

అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లోని హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్.. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వారి వివరాలను పరిశీలించారు. అలాంటి వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంజీఎం అడ్మినిస్ట్రేషన్ అధికారిని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరై బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. రికార్డు రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్.. రికార్డులను క్రమబద్ధంగా భద్రపరచాలని, గది ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ల్యాబ్‌లో సిబ్బంది భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఐడీ కార్డులు, మాస్కులు, చేతి గ్లౌజులు ధరించి విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ల్యాబ్‌లో ప్రస్తుతం ఉపయోగిస్తున్న మ్యానువల్ స్లిప్పుల స్థానంలో ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించి సాంకేతికతను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. తద్వారా రోగులకు సేవలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎంజీఎం ప్రాంగణంలోకి కుక్కలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆసుపత్రి పరిపాలన సక్రమంగా సాగేందుకు పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేయాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట ఎంజీఎం సూపరింటెండెంట్, వరంగల్ డి ఎం హెచ్ ఓ రాజిరెడ్డి, డీబీసీడీవో పుష్పలత తదితరులు ఉన్నారు.

## వావిలాలలోని అన్నపూర్ణ రైస్ మిల్లు సీజ్



**నిర్వాహకునిపై కేసు నమోదు**

పాలకుర్తి, అక్టోబరు 06(జనంసాక్షి) కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంలో భారీఅక్రమం చోటు చేసుకుంది. మండలంలోని వావిలాలలోని అన్నపూర్ణ రైస్ మిల్లులో రూ. 824 కోట్ల విలువ చేసే 2,998 మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టింది. ఈ వ్యవహారం అధికారుల తనిఖీలో బట్ట బయలయింది. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటి తహసిల్దార్ రఘునందన్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వావిలాలలోని అన్నపూర్ణ రైస్ మిల్లుకు ఖరీఫ్ సీజన్లో 2, 170 మెట్రిక్ టన్నుల ధాన్యం, రబీ సీజన్లో 827 టన్నుల ధాన్యం సేకరించి బియ్యాన్ని మరాడించడం కోసం సదరు మిల్లుకు అప్పగించారు. వాటి విలువ రూ. 27 కోట్లు ఉండనుందని వారు తెలిపారు. కాగా ఇటీవల పౌరసరఫరాల, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా 2998 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు వెల్లడైయింది. మిల్లులో మిగిలిన ధాన్యం1552 మెట్రిక్ టన్నుల ధాన్యం, బియ్యం అధికారులు సీజ్ చేశారు. అక్రమాలకు పాల్పడ్డ రైస్ మిల్లు నిర్వాహణపై 6ఏ కింద కేసు నమోదు చేసి మిల్లును సీజ్ చేసినట్లు తెలిపారు. తదుపరి చర్యల కోసం జిల్లా కలెక్టర్ కు నివేదికను అందచేసినట్లు ఆయన తెలిపారు.